# నినాదం

నిఖార్సైన జర్నలిజం

సోమవారం 18 మే 2026 | సంపుటి: 22 | సంచిక: 229 | వెల: రూ.7 | పేజీలు: 12+12

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam


## బాచుపల్లిలో 'హబీబ్స్' ప్రీమియం సెలూన్ ప్రారంభం

**హైదరాబాద్, బ్యూరో మే 17 (నినాదం )**

ప్రముఖ హెయిర్ అండ్ బ్యూటీ బ్రాండ్ హబీబ్స్ నూతన ప్రీమియం సెలూన్‌ను బాచుపల్లి మియాపూర్ రోడ్‌లోని లహరి ట్విన్స్ గ్రౌండ్ ఫ్లోర్‌లో సినీ, టెలివిజన్ నటి వర ఘనంగా ప్రారంభించారు. ఎండీ అమన్ హబీబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, స్థానికులు పాల్గొన్నారు.



2



### మే 25న పద్మ అవార్డుల ప్రదానోత్సవం

**రాష్ట్రపతి భవన్‌లో అట్టహాసంగా వేడుక**

దేశంలోనే అత్యున్నత పౌర పురస్కారాలైన 'పద్మ అవార్డుల' ప్రదానోత్సవానికి ముహూర్తం ఫిక్స్ అయింది. ఈ నెల 25న న్యూఢిల్లీలోని రాష్ట్రీయ భవన్‌లో ఈ వేడుక అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.

2




### తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాలు విడుదల

ఇంజినీరింగ్‌లో 1,44,704, అగ్రికల్చర్-ఫార్మసీలో 84,954 మంది పరీక్ష రాసిన విద్యార్థులు

పరీక్షలు పూర్తయిన ఆరో రోజే ఫలితాలు

2



### రాష్ట్రంలోకి ఆలస్యంగా... నైరుతి రుతుపవనాలు

మే 26న కేరళను తాకనున్న నైరుతి పవనాలు

కొన్ని జిల్లాల్లో తేలికపాటి వర్షాలకు అవకాశం

2

### 'సైలెన్స్ జోన్'గా తిరుమల

2

# యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో భారీ అగ్నిప్రమాదం

## యూనిట్-3లో ఎగసిపడిన మంటలు



- టర్బైన్ వద్ద చెలరేగిన మంటలు
- ఆయిల్ లీకేజీ వల్లే ప్రమాదమని ప్రాథమిక నిర్ధారణ
- ప్రాణనష్టం జరగక పోవడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు
- ఘటనపై అంతర్గత విచారణకు ఆదేశం

*నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామంలో ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఉన్న యూనిట్-3లో అకస్మాత్తుగా మంటలు అంటుకున్నాయి. క్షణాల వ్యవధిలోనే ఆ మంటలు భారీగా విస్తరించాయి. దీంతో ప్లాంటులో భారీ ఎత్తున మంటలు ఎగిసిపడుతున్నాయి. మధ్యాహ్నం పూట ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంతో పవర్ ప్లాంట్‌లో పనిచేస్తున్న సిబ్బంది తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.* - నల్గొండ, మే 17 (నినాదం)

ఇక ఈ అగ్ని ప్రమాదం కారణంగా.. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంటు సహా దాని పరిసర ప్రాంతాల్లో భారీ ఎత్తున పొగ అలముకుంది. ఇక ప్లాంటులో భారీ ఎత్తున మంటలు విరజిమ్ముతున్నాయి. ఇక ఈ అగ్నిప్రమాదం సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది.. హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకున్నారు. భారీగా ఎగిసిపడుతున్న మంటలను ఆర్పేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే యాదాద్రి పవర్ ప్లాంటులో అగ్నిప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఈ ప్రమాదం కారణంగా ఎవరికైనా గాయాలు అయ్యాయా, ఏదైనా ప్రాణ నష్టం జరిగిందా అనే దానిపై ఇప్పటివరకు క్లారిటీ లేదు. భారీ అగ్ని ప్రమాదం కావడంతో పెద్ద ఎత్తున ఆస్తి నష్టం ...మిగతా 2లో

## ఉప్పల్ రింగ్ రోడ్ పాక్షికంగా మూసివేత

2






## శాంతి చర్చలు..

**ఇరాన్ ముందు అమెరికా ఐదు కఠిన షరతులు**

యుద్ధ నష్టపరిహారం ఇవ్వబోమని స్పష్టం

400కిలోల యురేనియం ఇవ్వాలని డిమాండ్

స్తంభించిన నిధుల విడుదలకు నిరాకరణ

ఇరాన్ సైతం 5 షరతులు.. పరిహారం ఇవ్వాల్సిందేనని పట్టు

ఇరాన్‌తో జరుగుతున్న శాంతి చర్చల్లో అమెరికా ఐదు కఠిన షరతులు విధించింది. ఇప్పటి వరకు ఇరాన్‌కు జరిగిన నష్టాలకు ఎలాంటి పరిహారం చెల్లించే ప్రసక్తి లేదని తేల్చి చెప్పింది. ఈ మేరకు ఇరాన్‌కు చెందిన ఫార్స్ న్యూస్ ఏజెన్సీ ఓ నివేదికను విడుదల చేసింది. ఇరాన్ తన వద్ద ఉన్న 400 కిలోల శుద్ధిచేసిన యురేనియంను తమకు అప్పగించాలని అమెరికా డిమాండ్ చేసింది.

- న్యూఢిల్లీ (నినాదం)

2

## బండిని బర్తరఫ్ చేయాల్సిందే

**కేంద్ర మంత్రి పదవిలో కొనసాగడం దేశానికే అవమానం: కేటీఆర్**

పోక్సో కేసులో బండి సంజయ్ కుమారుడు అరెస్ట్

ఈ నేపథ్యంలోనే కేటీఆర్ విమర్శలు

నిందితుణ్ని 9 రోజులు కేంద్ర మంత్రే దాచారని ఆరోపణ

బాధిత కుటుంబాన్ని బెదిరించారన్న కేటీఆర్



**హైదరాబాద్ (నినాదం):** కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎల్బీనగర్‌లో నిర్వహించిన 'నా బూత్– నా భవిష్యత్తు' ...మిగతా 2లో

## బండి భగీరథ్ అరెస్ట్‌తో కేంద్రానికి సంబంధం లేదు

**కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి**

ఇప్పటికే సరెండర్... ఇక చర్చించాల్సిన అవసరం లేదు

రాష్ట్ర పోలీసులే చూసుకుంటారని స్పష్టీకరణ



**హైదరాబాద్, మే 17 (నినాదం):** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పోక్సో కేసులో అరెస్ట్ కావడంపై బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి స్పందించారు. భగీరథ్ ఇప్పటికే సరెండర్ అయ్యాడని గుర్తుచేశారు. ఇక దానిపై చర్చించాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. ఈ కేసుతో కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం ఉండదని స్పష్టం చేశారు. పూర్తిగా రాష్ట్ర పోలీసులే ఈ వ్యవహారాన్ని చూసుకుంటారని వివరించారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ...మిగతా 2లో

## చోళ వారసత్వ సంపద తిరిగి భారత్‌కు..

**ప్రధాని మోదీకి అప్పగించిన నెదర్లాండ్స్**

తిరిగి రానున్న 11వ శతాబ్దం నాటి చోళ రాగి ఫలకాలు

2



భారతదేశం అద్భుత దౌత్య, సాంస్కృతిక విజయాన్ని సాధించింది. 11వ శతాబ్దానికి చెందిన చారిత్రక 'చోళ రాగి ఫలకాలను' నెదర్లాండ్స్ నుంచి భారత్‌కు విజయవంతంగా తిరిగి తీసుకురానుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, డచ్ ప్రధానమంత్రి రాబ్ జెట్టెన్ సమక్షంలో జరిగిన ఒక ఉన్నత స్థాయి కార్యక్రమంలో ఈ కళాఖండాలను అధికారికంగా తిరిగి అప్పగించారు. ఈ క్రమంలోనే నెదర్లాండ్స్ ప్రభుత్వానికి ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. - న్యూఢిల్లీ (నినాదం)

## ఘనంగా అడిషనల్ డీజీ జన్మదిన వేడుకలు

**హాజరైన పోలీసు, ఇతర రంగాల ప్రముఖులు**




**హైదరాబాద్ ప్రతినిధి, మే 17 (నినాదం):** కేరళ రాష్ట్ర అడిషనల్ డీజీ జి. లక్ష్మణ్ జన్మదిన వేడుకలు ఆదివారం మసబ్ ట్యాంక్ పోలీసు ఆఫీసర్స్ మెస్‌లో ఘనంగా నిర్వహించారు.

కేరళ కేడర్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి అయిన లక్ష్మణ్ స్వస్థలం తెలంగాణ రాష్ట్రంలోని మహబూబాబాద్ జిల్లా డోర్నకల్. వృత్తిపరంగా ఆయన పక్క రాష్ట్రానికి చెందిన అధికారే అయినప్పటికీ, అక్కడ తన సేవల ద్వారా ప్రత్యేక గుర్తింపు పొందడంతో పాటు సొంత రాష్ట్రంతోనూ సత్సంబంధాలు కొనసాగిస్తున్నారు. పలువురు ఐపీఎస్,ఐఆర్ఎస్ లు, డీఎస్పీలు ఆపై ఇతర ఉన్నతాధికారులతో పాటు నగరానికి చెందిన ఇతర రంగాల పలువురు ప్రముఖులు ఈ వేడుకకు హాజరయ్యారు.


## వితంతువులకు కొత్తగా పెన్షన్లు

**ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు**

**కీలక నిర్ణయం తీసుకున్న చంద్రబాబు సర్కారు**

త్వరలోనే ఆన్ లైన్ లో పేర్లు నమోదుకు అవకాశం

**అమరావతి, (నినాదం):** రాష్ట్రంలోని వితంతువులకు ఏపీలోని కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా జూన్ 12వ తేదీ నుంచి కొత్తగా పింఛన్లు మంజూరు చేయనున్నట్లు రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, అర్హులైన లబ్ధిదారులు త్వరలోనే ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన అనంతరం ఆయన అధికారులతో మాట్లాడారు. గత ప్రభుత్వ వైఫల్యాల వల్ల అనేక రెవెన్యూ సమస్యలు పేరుకుపోయాయని, వాటిని పరిష్కరించేందుకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు





## 25 ఏళ్ల తర్వాత అధికారిక నివాసానికి సీఎం

**బెంగాల్ లో ఆసక్తికర పరిణామం**

బీజేపీ సీఎం సువేందు అధికారి కోసం

'సౌజన్య' భవనాన్ని సిద్ధం చేస్తున్న అధికారులు

జ్యోతి బసు తర్వాత బుద్ధదేవ్, మమత తమ సొంత ఇళ్లలోనే నివాసం

భద్రతా కారణాల దృష్ట్యా సువేందు కోసం కొత్త నివాసం ఎంపిక

2



## బాచుపల్లిలో 'హబీబ్స్' ప్రీమియం సెలూన్ ప్రారంభం

ఈ సందర్భంగా నటి వర్ష మాట్లాడుతూ, అంతర్జాతీయ ప్రమాణాలతో బాచుపల్లి ప్రజలకు నాణ్యమైన హెయిర్, బ్యూటీ సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. హబీబ్స్ ఎండీ అమన్ హబీబ్ మాట్లాడుతూ, ఆధునిక సాంకేతికతతో మహిళలు, పురుషుల కోసం ప్రత్యేక సేవలను అందిస్తున్నామని తెలిపారు. మార్చి 2027 నాటికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 20కి పైగా హబీబ్స్ అవుట్‌లెట్లు ప్రారంభించనున్నట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు.

## శాంతి చర్చలు..

అలాగే ఇరాన్‌లోని అణు కేంద్రాల్లో కేవలం ఒక్కదానికి మాత్రమే అనుమతి ఇస్తామని పేర్కొంది. విదేశాల్లో స్తంభించిపోయిన ఇరాన్ ఆస్తుల్లో కనీసం 25 శాతాన్ని కూడా విడుదల చేయబోమని తెలిపింది. వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న ఘర్షణల ముగింపు ఈ చర్చల పురోగతిపైనే ఆధారపడి ఉంటుందని అమెరికా లింక్ పెట్టింది. ఈ ఐదు షరతులకు ఇరాన్ అంగీకరించినా అమెరికా, ఇజ్రాయెల్ నుంచి ముప్పు అలాగే కొనసాగుతుందని వైనెట్ న్యూస్ అభిప్రాయపడింది. మరోవైపు ఇరాన్ కూడా చర్చల కోసం ఐదు షరతులను విధించింది. ముఖ్యంగా లెబనాన్‌లో ఘర్షణలు ఆపాలని, తమపై ఆంక్షలు ఎత్తివేయాలని, స్తంభించిన నిధులను విడుదల చేయాలని కోరింది. యుద్ధ నష్టపరిహారంతో పాటు హర్మూజ్ జలసంధిపై తమ సార్వభౌమాధికారాన్ని గుర్తించాలని డిమాండ్ చేసింది.

## యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో అగ్నిప్రమాదం

మొదటి పేజీ తరువాయి

జరిగినట్లు అంచనా వేస్తున్నారు. మంటలు అదుపులోకి వచ్చిన తర్వాత అధికారులు ప్రమాద తీవ్రతను అంచనా వేయనున్నారు. ప్రమాదానికి కారణాలపైనా అన్వేషించనున్నారు. పవర్ ప్లాంట్‌లోని యూనిట్-3లో ఉన్న టర్బైన్ డ్రైవన్ బాయిలర్ ఫీడ్ పంప్ ప్రాంతంలో ఈ అగ్నిప్రమాదం జరిగిరది. బాయిలర్ సమీపంలో ఆయిల్ లీక్ కాగా.. ఆ సమయంలో షార్ట్ సర్క్యూట్ షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో ఒక్కసారిగా మంటలు ఎగసిపడినట్లు తెలుస్తోంది. ఇక ఈ అగ్నిప్రమాదం జరిగిన వెంటనే అలర్ట్ అయిన ప్లాంట్ అధికారులు, టెక్నికల్ సిబ్బంది, ఫైర్ సిబ్బంది హుటాహుటిన స్పందించి మంటలను అదుపులోకి తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు. ఈ అగ్ని ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని.. ప్రాణనష్టం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇక ఈ ప్రమాదం వల్ల పవర్ ప్లాంట్‌లోని కంట్రోల్ కేబుల్స్‌తో పాటు వాల్వ్స్ తీవ్రంగా దెబ్బతిన్నాయని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే యాదాద్రి పవర్ ప్లాంట్‌లో అగ్నిప్రమాదాలు చోటు చేసుకోవడం ఇదేం తొలిసారి కాదు. గతేడాది మే నెలలో కూడా ప్లాంట్‌లోని యూనిట్-1లోనూ ఫైర్ యాక్సిడెంట్ జరిగింది. ఇక ప్రస్తుతం ప్రమాదం జరిగిన యూనిట్-3లో కొన్ని రోజుల క్రితమే అనధికారికంగా విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించగా.. అది జరిగిన కొద్ది రోజుల్లోనే ఇలాంటి ప్రమాదం జరగడం తీవ్ర దుమారం రేపుతోంది

## 25 ఏళ్ల తర్వాత అధికారిక నివాసానికి సీఎం

**కోల్‌కతా, (నినాదం):**

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఒక ఆసక్తికర పరిణామం చోటుచేసుకోనుంది. సుమారు 25 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి అధికారిక నివాసానికి మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీజేపీ ప్రభుత్వ నూతన ముఖ్యమంత్రి సువేందు అధికారి కోసం కోల్‌కతాలోని అలీపూర్ ప్రాంతంలో ఉన్న 'సౌజన్య' అనే ప్రభుత్వ భవనాన్ని అధికారులు సిద్ధం చేస్తున్నారు. రాష్ట్ర పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ ఈ మేరకు ఏర్పాట్లు చేస్తోంది. గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన జ్యోతి బసు సాల్ట్ లేక్‌లోని 'ఇందిరా భవన్' అనే అధికారిక నివాసంలో ఉండేవారు. ఆయన తర్వాత ముఖ్యమంత్రులైన బుద్ధదేవ్ భట్టాచార్య, మమతా బెనర్జీ మాత్రం తమ సొంత ఇళ్లలోనే నివసించారు. దీంతో పాతికేళ్లుగా బెంగాల్‌కు అధికారిక సీఎం హౌస్ లేకుండా పోయింది. ఇప్పుడు సువేందు అధికారి ఆ సంప్రదాయానికి తెరదించున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం సువేందు అధికారి కోల్‌కతాలోని చైనార్ పార్క్‌లో ఒక ఫ్లాట్‌లో నివసిస్తున్నారు. అయితే ఆ ప్రాంతం భద్రతాపరంగా అంత సురక్షితం కాదని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఈ నేపథ్యంలోనే అధికారులు అత్యంత భద్రత, అన్ని సౌకర్యాలు ఉన్న 'సౌజన్య' భవనాన్ని ఎంపిక చేశారు. విశేషమేమిటంటే, ఈ భవనం భవానీపూర్ నియోజకవర్గంలోనే ఉంది. ఇటీవలి ఎన్నికల్లో సువేందు ఇదే నియోజకవర్గంలో మమతా బెనర్జీపై విజయం సాధించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన ఈ గెస్ట్ హౌస్‌ను 2018లో మమతా బెనర్జీనే ప్రారంభించారు. ఈ ప్రతిపాదనకు సువేందు అధికారి ఇంకా అంగీకారం తెలపాల్సి ఉంది. ఆయన ఒప్పుకుంటే, 'సౌజన్య' బెంగాల్ కొత్త సీఎం హౌస్‌గా మారుతుంది.

# ఉప్పల్ రింగ్ రోడ్ పాక్షికంగా మూసివేత

### 3 నెలల ట్రాఫిక్ ఆంక్షలు

**హైదరాబాద్, మే 17 (నినాదం)**

హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులకు అలర్ట్. ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు గాను ఉప్పల్ రింగ్ రోడ్డు పరిధిలో నేటి (ఆదివారం) నుంచి మూడు నెలల పాటు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, రాచకొండ ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా ప్రకటించారు. ఉప్పల్ సర్కిల్‌లో వరంగల్ వైపు వెళ్లే ప్రధాన రహదారిని ఆదివారం నుంచి తాత్కాలికంగా మూసివేయనున్నారు. నిర్మాణ సామగ్రి తరలింపు, పిల్లర్ల ఏర్పాటు పనుల దృష్ట్యా ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా భారీ ఎత్తున దారి మళ్లింపులు చేపట్టారు. ఇందులో భాగంగా ఉప్పల్



సర్కిల్‌లో ఉన్న వరంగల్ బస్టాప్, యాదగిరిగుట్ట బస్టాప్‌లను తాత్కాలికంగా నల్లచెరువు కట్ట సమీపానికి మార్చారు. రామంతాపూర్ లేదా హబ్సిగూడ వైపు నుంచి వరంగల్ మార్గంలో వెళ్లే వాహనాలను జీఎస్ఐ వద్ద దారి మళ్లించనున్నారు. ఈ వాహనాలు పిస్తా హౌస్, లిటిల్ ఫ్లవర్ స్కూల్ వెనుక భాగం నుంచి బీరప్ప గడ్డ మీదుగా వరంగల్ జాతీయ రహదారిని చేరుకోవాల్సి ఉంటుంది. అలాగే నాగోల్, ఎల్బీనగర్ వైపు నుంచి వరంగల్ వెళ్లే వాహనాలు హయాత్‌నగర్ మీదుగా పెద్ద అంబర్‌పేట్ వద్ద ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు పైనుంచి లేదా సర్వీస్ రోడ్డు మార్గంలో ఘట్కేసర్ వద్ద వరంగల్ జాతీయ రహదారికి చేరుకోవాల్సి ఉంటుంది. వరంగల్ వైపు నుంచి హైదరాబాద్ నగరంలోకి వచ్చే వాహనాలను మేఫీల్ హోటల్ వద్ద దారి మళ్లించనున్నారు. ఈ వాహనాలు ఉప్పల్ భగాయత్ మీదుగా నాగోల్ సర్వీస్ రోడ్డులోకి ప్రవేశించి నాగోల్ ఫ్లైఓవర్ వద్ద యూటర్న్ తీసుకుని నగరం లోపలికి రావాల్సి ఉంటుంది. వరంగల్ నుంచి వచ్చే భారీ సరుకు రవాణా వాహనాలను ఓఆర్ఆర్ మీదుగా హయత్‌నగర్‌కు మళ్లిస్తారు. అదేవిధంగా వరంగల్‌కు వెళ్లే భారీ వాహనాలను కూడా హయత్‌నగర్, ఓఆర్ఆర్ మీదుగా ఘట్కేసర్‌కు మళ్లించనున్నారు. ఇక పీర్జాదిగూడ వైపు నుంచి సికింద్రాబాద్ వెళ్లే వాహనాలు ఉప్పల్ జంక్షన్ రాకముందే ఉన్న లక్ష్మారెడ్డి కాలనీ మీదుగా ప్రయాణించి ఉప్పల్ మెట్రో స్టేషన్ వద్ద ఉన్న మాస్టర్ చెఫ్ రెస్టారెంట్‌కు చేరుకోవాలి. అక్కడ యూ-టర్న్ తీసుకుని సికింద్రాబాద్ వైపు వెళ్లాల్సి ఉంటుంది. పీర్జాదిగూడ నుంచి నాగోల్ వెళ్లాలన్నా.. నాగోల్ నుంచి వరంగల్ వైపు వెళ్లాలన్నా.. ఉప్పల్ భగాయత్ లేఔట్ మార్గాన్ని ఉపయోగించుకోవాలని అధికారులు సూచించారు. కాగా, హబ్సిగూడ నుంచి నాగోల్ వైపు వెళ్లే వాహనాలకు ఎలాంటి ఆంక్షలు లేవని ఆ మార్గం యథాతథంగా కొనసాగుతుందని ఎంఎంసీ కమిషనర్ స్పష్టం చేశారు. రాబోయే మూడు నెలల పాటు వాహనదారులు పోలీసులకు సహకరించి ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని కోరారు.

# చోళ వారసత్వ సంపద తిరిగి భారత్‌కు..







19వ శతాబ్దం మధ్యకాలం నుంచి ఈ అసాధారణమైన రాగి ఫలకాలను జాగ్రత్తగా భద్రపరిచిన లైడెన్ విశ్వవిద్యాలయాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. భారత్-నెదర్లాండ్స్ మధ్య బలపడుతున్న వ్యూహాత్మక, సాంస్కృతిక సంబంధాలకు ఒక శక్తివంతమైన ఉదాహరణగా నిలిచింది. మరోవైపు వారసత్వ సంపదను తిరిగి పొందడం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ ఆనందం వ్యక్తం చేశారు. "ప్రతి భారతీయుడికి ఇది ఒక ఆనందకరమైన క్షణం! 11వ శతాబ్దానికి చెందిన చోళుల రాగి ఫలకాలు నెదర్లాండ్స్ నుంచి భారతదేశానికి తిరిగి రానున్నాయి. ప్రధానమంత్రి రాబ్ జెట్టెన్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో నేను పాల్గొన్నాను. చోళుల రాగి ఫలకాల్లో 21 పెద్ద ఫలకాలు, 3 చిన్న ఫలకాలు ఉన్నాయి. వీటిపై ఎక్కువగా ప్రపంచంలోని అత్యంత అందమైన భాషల్లో ఒకటైన తమిళంలోని రచనలు ఉన్నాయి. ఇవి రాజేంద్ర చోళుడు I తన పూర్వీకులు తండ్రి, మొదటి రాజరాజ చక్రవర్తి చేసిన మౌఖిక వాగ్దానాన్ని అధికారికంగా నెరవేర్చడానికి సంబంధించినవి. అవి చోళుల గొప్పతనాన్ని కూడా చాటిచెబుతాయి. భారతదేశంలో చోళులు, వారి సంస్కృతి, సముద్రయాన పరాక్రమం పట్ల ఎంతో గర్వపడుతున్నాం" అని ప్రధాని మోదీ అన్నారు. ఇవి నెదర్లాండ్స్‌లో లైడెన్ ఫలకాలుగా, భారతదేశంలో అనైమంగళం రాగి ఫలకాలుగా ప్రసిద్ధి చెందాయి. ఈ ప్రాచీన శాసనాలను తిరిగి తీసుకురావాలని భారత్ 2012 నుంచి అవిశ్రాంతంగా ప్రయత్నిస్తోంది. సుమారు 30 కిలోగ్రాముల బరువున్న ఈ 21 రాగి ఫలకాలు, చోళ సామ్రాజ్య అధికారిక రాజముద్రను కలిగిన ఒక భారీ కంచు ఉంగరంతో ఉంది. ఇది భారత సరిహద్దుల వెలుపల ఆ రాజవంశానికి సంబంధించిన అత్యంత కీలకమైన ఆధారాల్లో ఒకటిగా నిలుస్తుంది. ఈ గ్రంథాలు సంస్కృతం, తమిళం రెండింటిలోనూ ఉన్నాయి. ఇతర దేశాలు దొంగిలించిన వారసత్వ సంపదను తిరిగి పొందే విషయంలో భారత్ ప్రపంచవ్యాప్తంగా సాధిస్తున్న విజయాలకి ఇది నిదర్శనంగా నిలిచింది. ఇదిలా ఉండగా భారత్, నెదర్లాండ్స్ దేశాలు తమ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచుకున్నాయి. ఈ మేరకు ఆ దేశ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ, నెదర్లాండ్స్ ప్రధాని రాబ్ జెట్టెన్ మధ్య చర్చల సందర్భంగా రక్షణ, కీలక ఖనిజాలు, ఇతర రంగాల్లో కలిపి ఇరు దేశాలు 17 ఒప్పందాలపై సంతకాలు చేశాయి. చర్చల సందర్భంగా ఇరు దేశాల ప్రధానమంత్రులు పశ్చిమాసియాలో పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గ్లోబల్ ఎనర్జీ సరఫరా, వాణిజ్య నెట్‌వర్క్‌లకు ఆటంకాల వల్ల ఈ ప్రాంతం సహా ప్రపంచంపై పడే తీవ్ర ప్రభావాలపై సమాలోచనలు జరిపారు. హర్మూజ్ జలసంధి నుంచి నౌకాయాన స్వేచ్ఛ, అంతర్జాతీయ వాణిజ్య ప్రవాహం కొనసాగాలని మోదీ, జెట్టెన్ పిలుపునిచ్చారు. ఎలాంటి నియంత్రణ చర్యలనైనా వ్యతిరేకించాలని, ఆ దిశగా జరుగుతున్న ప్రయత్నాలకు తమ మద్దతును కొనసాగించాలని ఉమ్మడి ప్రకటనలో తెలిపారు. ఉక్రెయిన్‌లో తాజా పరిస్థితి, రష్యాతో కొనసాగుతున్న ఘర్షణ, ప్రాంతీయ భద్రతా పరిణామాల గురించి కూడా ఇరువురు నేతలు చర్చించారు. చర్చలు, దౌత్యం ద్వారా ఉక్రెయిన్‌లో శాశ్వతమైన శాంతిని సాధించే ప్రయత్నాలకు మద్దతు కొనసాగించాలని పేర్కొన్నారు. అటు నెదర్లాండ్స్ ప్రధాని రాబ్ జెట్టెన్‌తో కలిసి ఆదివారం అఫ్స్లూయిట్‌డైక్ డ్యామ్‌ను ప్రధాని మోదీ సందర్శించారు.

## బండిని బర్తరఫ్ చేయాల్సిందే

మొదటి పేజీ తరువాయి

కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్ కుమారుడు భగీరథ్ పోక్సో కేసులో అరెస్టైన నేపథ్యంలో ఆయన ఈ విమర్శలు చేశారు. రాష్ట్రంలో ఒక బాలికకు తీవ్ర అన్యాయం జరిగితే ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా మిన్నకుండిపోయిందని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలిసి బాధితురాలికి అన్యాయం చేయాలని చూశాయని విమర్శించారు. కానీ ఆ బాలికకు న్యాయం జరిగేలా బీఆర్ఎస్ పార్టీ మాత్రమే పోరాడిందని తెలిపారు. గత రెండున్నరేళ్లుగా తెలంగాణలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని ఆరోపించారు. ప్రధాని మోదీ చెబుతున్న 'బేటీ పడావో.. బేటీ బచావో' నినాదం కేవలం మాటలకే పరిమితమైందని విమర్శించారు. దేశ చరిత్రలో బహుశా మొదటి సారి ఓ కేంద్రమంత్రి కుమారుడిపై లుకౌట్ సర్క్యులర్ ఇచ్చే పరిస్థితి వచ్చిందని కేటీఆర్ అన్నారు. బండి సంజయ్‌ను మంత్రి పదవి నుంచి తొలగించకపోతే ఈ కేసులో విచారణ సరిగా జరగదని అనుమానం వ్యక్తం చేశారు. తప్పు చేసిన వ్యక్తిని దాదాపు 9 రోజుల పాటు దాచిపెట్టింది కేంద్రమంత్రేనని ఆరోపించారు. బాధితురాలి తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురి చేసి కేసును నీరుగార్చాలని చూశారన్నారు. ఇలాంటి వ్యక్తులు ఉన్నతమైన పదవుల్లో కొనసాగడం తెలంగాణ రాష్ట్రానికే గాక దేశానికే అవమానమని మండిపడ్డారు.

## బండి భగీరథ్ అరెస్ట్‌తో కేంద్రానికి సంబంధం లేదు

మొదటి పేజీ తరువాయి

ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు.

**ప్రతిపైసా కేంద్రానిదే**

మరోవైపు ధాన్యం సేకరణ విషయంలో తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కిషన్ రెడ్డి ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లకు ప్రతిపైసా కేంద్రమే ఇస్తోందని వెల్లడించారు. అయినా రైతుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు కొనడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా సన్న వడ్లకు రాష్ట్రం బోనస్ ఇవ్వడం లేదని ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యంపై రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారని.. వారికి రాష్ట్ర ప్రభుత్వమే సమాధానం చెప్పాలన్నారు. మంత్రులు స్వయంగా వెళ్లి క్షేత్రస్థాయిలో కొనుగోళ్లను పర్యవేక్షించాలని సూచించారు.

# తెలంగాణలో ఎప్‌సెట్ ఫలితాలు విడుదల

తెలంగాణలో ఎప్‌సెట్ ఫలితాలు విడుదల అయ్యాయి. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, జేఎన్‌టీయూ వీసీ టి.కిషన్ కుమార్ రెడ్డితో కలిసి విడుదల చేశారు. గతేడాది కంటే ఇంజినీరింగ్‌లో ఈసారి 0.1 శాతం ఉత్తీర్ణత పెరిగిందని అధికారులు తెలిపారు. కాగా వారం రోజుల్లో కౌన్సెలింగ్‌కి షెడ్యూల్ ప్రకటిస్తామని జేఎన్‌టీయూ అధికారులు వెల్లడించారు. ఇంజినీరింగ్ విభాగంలో 1,97,241 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 1,44,704 మంది మంది విద్యార్థులు అర్హత సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్‌లో 84,954 మంది విద్యార్థులు పరీక్ష రాస్తే, 73,294 మంది అర్హత సాధించారు. పరీక్ష పూర్తయిన ఆరో రోజే ఫలితాలు విడుదల : ఎప్‌సెట్ పరీక్ష పూర్తయిన ఆరో రోజే ఫలితాలు వెలువడటం విశేషం. ఇంజినీరింగ్‌లో టాప్-10 ర్యాంకర్ల వివరాల్ని విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ యోగితా రాణా వివరించారు. ఫలితాల కోసం లింక్ క్లిక్ చేయండి. ఫలితాల లాగిన్ విండోలో అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్, రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీ వివరాలను ఎంటర్ చేసి ర్యాంక్ కార్డును సులభంగా డౌన్ లోడ్ చేసుకోవచ్చు. అగ్రికల్చర్, ఫార్మాలో టాపర్స్‌గా నిలిచిన వారి వివరాల్ని సాంకేతిక విద్యా కమిషనర్ దేవసేన వెల్లడించారు. ఇంజినీరింగ్ విభాగంలో 3వ, 4వ ర్యాంకులో నిలిచిన విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు. కాగా అగ్రికల్చర్, ఫార్మాలో 6,7,9వ స్థానాల్లో నిలిచిన వారు ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు అని అధికారులు తెలిపారు. ఎప్‌సెట్ ఇంజినీరింగ్ విభాగంలో 73.36 శాతం ఉత్తీర్ణత : గతేడాది ఇంజినీరింగ్‌లో 73.26 శాతం కాగా ఈసారి 73.36 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ వి. బాలకిష్టారెడ్డి తెలిపారు. గతంలో పోలిస్తే అగ్రికల్చర్ ఫార్మాలో ఉత్తీర్ణత 1.55 శాతం తగ్గింది

**ఎప్‌సెట్‌లో ఇంజినీరింగ్ విభాగంలో టాప్-10 ర్యాంకర్లు :**

ఎం.రుషి (మేడ్చల్-మల్కాజ్‌గిరి)
అన్షుల్ (మేడ్చల్)
ఎం.వంశీధర్ రెడ్డి (కడప)
జె.రోషన్ మణిదీప్‌రెడ్డి (గుంటూరు)
ఎ. సాయినిఖిత్ (మహబూబ్‌నగర్)
ఎం.అస్నా (మేడ్చల్)
వి.శరద్ మహీశ్వరి (హైదరాబాద్)
టి.శ్రేయాస్‌రెడ్డి (హైదరాబాద్)
బి.సమీరాజ్‌రెడ్డి (రంగారెడ్డి)
ఆర్.జయంత్ శేఖర్ (మేడ్చల్)

**అగ్రికల్చర్-ఫార్మసీ విభాగంలో టాప్-10 ర్యాంకర్లు :**

ఎం.అహ్మద్(హైదరాబాద్)
టి.నివృత్ సాయికిరణ్(హైదరాబాద్)
జి.సాహితి గీతిక(రంగారెడ్డి)
ఎం.జయసింహ(హైదరాబాద్)
ఎ.అన్వాస్(హైదరాబాద్)
ఎన్.జెరూష(సత్యసాయి జిల్లా)
పి.అనురాగ్(తూర్పు గోదావరి)
బి.సాయిశరణ్(సూర్యాపేట)
ఎం.మారుతి సత్యశ్రీకర్(తూర్పు గోదావరి)
ఎం.రుతుంబిక(మేడ్చల్)

**ఆరు రోజుల్లోనే ఫలితాలు**

పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించిన జేఎన్‌టీయూహెచ్ యాజమాన్యానికి ఉన్నత విద్యామండలి ఛైర్మన్ వి.బాలకిష్టారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఎప్పుడూ లేని విధంగా ఎప్‌సెట్ పరీక్ష నిర్వహించిన అనంతరం ఆరు రోజుల్లోనే ఫలితాలు విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

**త్వరలోనే కౌన్సిలింగ్ షెడ్యూల్**

అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం వారికి 2026 మే 4 నుంచి మే 5 తేదీలలో పరీక్షలు నిర్వహించారు. ఇంజినీరింగ్ స్ట్రీమ్ విద్యార్థులకు 2026 మే 9 నుంచి మే 11 వరకు ఎగ్జామ్స్ జరిగాయి. త్వరలో కౌన్సిలింగ్ షెడ్యూల్, వెబ్ ఆప్షన్లు, సీట్ల కేటాయింపుపై అధికారులు పూర్తి వివరాలు వెల్లడించనున్నట్లు తెలిపారు. ఎప్‌సెట్‌ను విజయవంతంగా నిర్వహించిన జేఎన్‌టీయూ అధికార బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు. మరో వారం రోజుల్లో ఎప్‌సెట్ కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.

# 'సైలెన్స్ జోన్'గా తిరుమల

**శబ్ద కాలుష్యాన్ని 80 శాతం తగ్గించేందుకు ప్రణాళిక**

**తిరుమలలో పెట్రోల్, డీజిల్ వాహనాలపై భారీ టోల్ విధింపునకు టీటీడీ యోచన**

**ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించి, పర్యావరణాన్ని కాపాడటమే ప్రధాన లక్ష్యం**

**అలిపిరి వద్ద రూ.500 కోట్లతో అన్ని సౌకర్యాలతో భారీ టౌన్‌షిప్ నిర్మాణం**

**తిరుమలను 'సైలెన్స్ జోన్'గా మార్చి, శబ్ద కాలుష్యాన్ని 80 శాతం తగ్గించేందుకు ప్రణాళిక**

**రూ.100 కోట్లతో అన్నదానం వంటశాల ఆధునికీకరణ, ఏఐ ఆధారిత నిర్వహణ**

**తిరుమల, మే (నినాదం):**

తిరుమల పవిత్రతను కాపాడుతూ, పర్యావరణ హితమైన ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) భారీ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా తిరుమల కొండపైకి వెళ్లే పెట్రోల్, డీజిల్ వాహనాలపై భారీగా టోల్ ఫీజు విధించాలని యోచిస్తోంది. ఎలక్ట్రిక్ వాహనాలకు (ఈవీ) ప్రోత్సాహం కల్పించడంతో పాటు, అలిపిరి వద్దే రూ.500 కోట్లతో ఒక భారీ టౌన్‌షిప్‌ను నిర్మించాలని ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ మేరకు టీటీడీ ఈవో ఎం. రవిచంద్ర కీలక వివరాలను వెల్లడించారు.

ప్రస్తుతం రోజుకు సగటున 8,000 వాహనాలు తిరుమలకు వస్తుండటంతో పర్యావరణ, శబ్ద కాలుష్యం పెరుగుతోందని రవిచంద్ర తెలిపారు. దీన్ని నివారించేందుకు ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో పెట్రోల్, డీజిల్ వాహనాలపై భారీ టోల్ విధించనున్నారు. అయితే, ఈ నిర్ణయం వెంటనే అమలులోకి రాదని, భక్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ఎలక్ట్రిక్ వాహనాలకు టోల్ ఫీజు నుంచి మినహాయింపు ఇచ్చి, వాటి కోసం ప్రత్యేకంగా చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

ఈ ప్రణాళికలో మరో కీలకమైన అంశం అలిపిరి వద్ద రూ.500 కోట్ల వ్యయంతో భారీ టౌన్‌షిప్ నిర్మాణం. సుమారు 150 ఎకరాల్లో నిర్మించే ఈ టౌన్‌షిప్‌లో వసతి, పార్కింగ్, భోజన సౌకర్యాలు, పూజా సామగ్రి వంటి అన్ని సదుపాయాలు కల్పించనున్నారు. "దీన్ని తిరుమల కొండ దిగువ భాగంలో అభివృద్ధి చేస్తాం" అని ఈవో తెలిపారు. భక్తులు ఇక్కడే తమ మొక్కులు



తీర్చుకుని, ఆ తర్వాత దర్శనం కోసం కొండపైకి వెళ్లేలా ఏర్పాట్లు చేయనున్నారు. వీటితో పాటు, తిరుమలను కఠినంగా 'సైలెన్స్ జోన్'గా అమలు చేసి, శబ్ద కాలుష్యాన్ని 80 శాతం వరకు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రూ.100 కోట్లతో అన్నదానం వంటశాలను ఆధునికీకరించడం, క్యూలైన్లకు బదులు భక్తులను నేరుగా అన్నదానం హాల్స్‌కు పంపడం వంటి చర్యలు కూడా చేపట్టనున్నారు. ఈ సంస్కరణల ద్వారా భక్తులను నిరుత్సాహపరచడం కాదని, వారి దర్శనాన్ని మరింత ప్రశాంతంగా, ఆధ్యాత్మికంగా మార్చడమే తమ ఉద్దేశమని ఈవో రవిచంద్ర వివరించారు.

## రాష్ట్రంలోకి ఆలస్యంగా... నైరుతి రుతుపవనాలు

తెలంగాణలో నైరుతి రుతుపవనాల ఆగమనం కోసం మరికొన్ని రోజులు ఆగాల్సిందే. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు జూన్ మొదటి వారంలో రాష్ట్రంలోకి ప్రవేశించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. గత ఏడాదితో పోలిస్తే రుతుపవనాల రాక 4 నుంచి 5 రోజులు ఆలస్యం కానుంది.

ఈ నెల 26వ తేదీన కేరళను తాకనున్న రుతుపవనాలు, ఆ తర్వాత సాధారణంగా 4 నుంచి 7 రోజుల్లో తెలంగాణలోకి ప్రవేశిస్తాయని అధికారులు వివరిస్తున్నారు. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవులు, బంగాళాఖాతం, అరేబియా సముద్రంలోని కొన్ని ప్రాంతాల్లో విస్తరించాయి. ఇవి మరింత ముందుకు సాగేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపింది.

**కొనసాగుతున్న ఎండల తీవ్రత**

ఇదిలా ఉండగా, రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతోంది. చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శనివారం అదిలాబాద్‌లో అత్యధికంగా 44.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డయింది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

మరోవైపు, నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆదివారం జోగులాంబ గద్వాల్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి, వనపర్తి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలిక పాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.



## మే 25న పద్మ అవార్డుల ప్రదానోత్సవం

వివిధ రంగాలలో దేశానికి విశేష సేవలు అందించిన ప్రముఖులకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన చేతుల మీదుగా ఈ ప్రతిష్టాత్మక అవార్డులను ప్రదానం చేయనున్నారు. అయితే, ఈ ఏడాది వివిధ రంగాలకు చెందిన మొత్తం 131 మంది ప్రతిభావంతులను కేంద్ర ప్రభుత్వం పద్మ అవార్డులకు ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. సమాజ సేవ, కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సైన్స్ అండ్ ఇంజనీరింగ్, వర్తకం-పరిశ్రమలు వంటి విభిన్న రంగాలలో అసాధారణ ప్రతిభ కనబరిచిన వారికి ఈ గౌరవం దక్కింది. ఈ మేరకు ఐదుగురికి పద్మ విభూషణ్. 13 మందికి పద్మభూషణ్, 113 మందికి పద్మశ్రీ పురస్కారాలు అందజేయనున్నారు. రాష్ట్రపతి భవన్‌లోని చారిత్రాత్మక దర్బార్ హాల్‌లో జరగనున్న ఈ అధికారిక కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, విదేశీ ప్రముఖులు, ఉన్నతాధికారులు పాల్గొననున్నారు.

# శ్రీ చైతన్య విద్యార్థుల విజయభేరి

## తెలంగాణ ఈఏపిసెట్ 2026 ఫలితాల్లో టాప్ 10లో 10 ర్యాంకులు







**హైదరాబాద్, మే 17 (నినాదం):** నేడు విడుదలైన తెలంగాణ ఈఏపీసెట్ 2026 ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు అద్భుత విజయాలను నమోదు చేశారు. ఇంజనీరింగ్, అగ్రి/ఫార్మా విభాగాల్లో టాప్ ర్యాంకులతో శ్రీచైతన్య మరోసారి నంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ ఏడాది ఫలితాల్లో టాప్ 10 లోపు 10 ర్యాంకులు, టాప్ 100 లోపు ఏకంగా 93 ర్యాంకులు సాధించి సంస్థ సరికొత్త రికార్డును సృష్టించింది. ఈ ర్యాంకులు సాధించిన విద్యార్థుల్లో అత్యధిక శాతం మంది శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు కావడం విశేషం. ఈ ఘనవిజయంపై శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ మాట్లాడుతూ సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి ఇప్పటివరకు ఇంజనీరింగ్ విభాగంలో 7 సార్లు, అగ్రి/ఫార్మా విభాగంలో 7 సార్లు స్టేట్ ఫస్ట్ ర్యాంకులు సాధించిన విజయ పరంపర ఒక్క శ్రీచైతన్యకే దక్కిందని ఆమె గుర్తుచేశారు. నిన్న విడుదలైన జాతీయ స్థాయి జేఈఈ మెయిన్ (జేఈఈ మెయిన్ 2026) ఫలితాల్లో 300 కి 300 మార్కులతో ఓపెన్ కేటగిరీలో రెండు ఆలిండియా ఫస్ట్ ర్యాంకులు సాధించామని, నేడు రాష్ట్ర స్థాయి ఈఏపీసెట్ లోనూ అదే ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ నెం.1 స్థానాన్ని నిలబెట్టుకున్నామని చెప్పారు. సంస్థ రూపొందించిన ప్రత్యేక ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాములు, ఇంటర్నల్ టెస్ట్ పేపర్లు, మరియు స్టూడెంట్-టీచర్ వన్-టు-వన్ అడాప్షన్ సిస్టమ్ ద్వారా అనుభవజ్ఞులైన అధ్యాపకులు అందించిన శిక్షణే ఈ అద్భుత ఫలితాలకు ప్రధాన కారణమని సుష్మ వివరించారు. గత 40 ఏళ్లుగా ఇంజనీరింగ్, మెడికల్ రంగాల్లో అత్యుత్తమ మార్కులు, ర్యాంకులు సాధిస్తున్న ఘనత తమదేనని స్పష్టం చేశారు. పోటీ పరీక్ష ఏదైనా, పరీక్ష విధానాలు ఎలా మారినా నెం.1 గా నిలిచేది తమ విద్యార్థులేనని, రాబోయే జేఈఈ అడ్వాన్స్డ్, నీట్ పరీక్షల్లోనూ ఇదే రకమైన విజయ పరంపరను కొనసాగిస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మరియు అధ్యాపక బృందాన్ని ఆమె అభినందించారు.

# ఓటర్ల జాబితా తయారీలో కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి

- మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



**కుత్బుల్లాపూర్, మే 17 (నినాదం):** ప్రత్యేక ఓటరు సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం పట్ల పార్టీ నాయకులు కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు లు పిలుపునిచ్చారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధ్యక్షతన శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ (సర్) కార్యక్రమం ప్రారంభమైన నాటి నుండి దేశవ్యాప్తంగా వివిధ రకాల విమర్శలు వ్యతిరేకత వ్యక్తం అవుతుందని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని పార్టీకి చెందిన నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్లు (బిఎల్ఎ)లు జాగ్రత్తతో వ్యవహరించాలని సూచించారు. మరణించిన ఓటర్లను జాబితా నుండి తొలగించడం, 18 సంవత్సరాలు నిండిన వారిని ఓటరుగా చేర్చడం జరుగుతుందని చెప్పారు. ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. వివిధ రాష్ట్రాలు, వివిధ భాషలకు చెందిన వారు వచ్చి స్థిరపడి ఓటర్లుగా నమోదయ్యారన్నారు. సర్వే కార్యక్రమంలో ఓటర్ల పేర్లు తొలగిపోకుండా ప్రజల జాగ్రత్తగా ఉండేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యతను పార్టీ శ్రేణులు తీసుకోవాలన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమం నిర్వహణ పాటించవలసిన నియమ నిబంధనలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నాయకులకు అవగాహన కల్పించారు. 2002 జనాభా ప్రతిపాదికను ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ కార్యక్రమంలో నిజమైన ఓటర్లను గుర్తించడంతో పాటు డూప్లికేట్ ఓట్లు, పర్మనెంట్ మైగ్రేటెడ్ ఓట్లు, అసలు మనుషులు లేని పేర్లతో ఉన్న ఓట్లను గుర్తించడం, కుటుంబ సభ్యుల ఓట్లను మ్యాపింగ్ చేయడం, కొత్త ఓటర్లను చేర్చడం, ఏమైనా చేర్పులు మార్పులు ఉంటే వాటిని సరిదిద్దేలా నాయకులు, బిఎల్ఏలు, సంక్షేమ సంఘాల నాయకులు, సీనియర్ సిటిజన్స్, యువత ఒక బాధ్యతగా తీసుకొని ప్రజలను చైతన్య పరుస్తూ అధికారులను సమన్వయ పరుచుకుంటూ సర్ కార్యక్రమాన్ని సద్వినియోగం పరుచుకోవాలనేలా పనిచేయాలన్నారు.

రానున్న రోజుల్లో బీఆర్ఎస్ అధినేత కేసిఆర్ ఆధ్వర్యంలో పార్టీ బలోపేతంపై చేపటనున్న సభ్యత్వ నమోదు కార్యక్రమం నూతన కమిటీల నియామకంతో పాటు పార్టీ బలోపేతానికి మరింత ప్రజల్లోకి ఎలా దూసుకెళ్ళుటకు చేపట్టాల్సిన కార్యాచరణను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, పలు డివిజన్లకు చెందిన పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, పలు సంక్షేమ సంఘాల నాయకులు, మహిళా నాయకులు, అనుబంధ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## త్రివిద్య విద్యార్థుల సంచలన ఫలితాలు



**అల్వాల్, మే 17( నినాదం):** తెలంగాణ ఇఫాసెట్ ఫలితాలలో శ్రీవిద్య కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో ప్రపంచం సృష్టించారు. కె హర్షిత్ రెడ్డి. 30వ ర్యాంక్. ఎంఎస్ ప్రత్యుమాన్యరెడ్డి రెడ్డి.115 ర్యాంక్ పి శ్రీవిద్య 147 వ ర్యాంకు తోపాటు 37 మంది విద్యార్థులు 5000 లోపల ర్యాంకులతో ఉత్తమ ఫలితాలు సాధించారని త్రివిద్య కళాశాల యజమాన్యం పేర్కొంది. కళాశాల చైర్మన్ పి శ్రీధర్ కుమార్ రెడ్డి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను బోధన సిబ్బందిని. తల్లిదండ్రులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళిక బద్ధత మైన క్రమశిక్షణ శిక్షణతో కూడిన బోధన. కటోర శ్రమ తల్లిదండ్రుల ఉత్సాహంతోనే ఇలాంటి అత్యుత్తమ ఫలితాలు సాధించగలమని చైర్మన్ తెలిపారు. జాతీయస్థాయిలో రాష్ట్ర స్థాయిలో కూడా తమ త్రివిద్య విద్యార్థిని విద్యార్థులు ఉత్తమ ప్రదేభా కనబరుస్తున్నందుకు హర్షం వ్యక్తం చేశారు.

## సమాజ ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యం

### బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్



**ఎల్ బినగర్, నినాదం:** సమాజ ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమని బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం భాగ్యనగర్ బ్రాహ్మణ సొసైటీ ఆధ్వర్యంలో కొత్తపేటలోని భాగ్యనగర్ బ్రాహ్మణ భవనంలో అన్ని బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి బ్రాహ్మణ పరిషత్ నూతన చైర్మన్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన బసవరాజు శ్రీనివాస్, వైస్ చైర్మన్ పొన్నాడ సుబ్రహ్మణ్యం లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బ్రాహ్మణ సమాజానికి చెందిన ప్రముఖులు, సభ్యులు పెద్ద ఎత్తున హాజరై సమావేశాన్ని విజయవంతం చేశారు. సమాజ సేవ, ఐక్యత, ఆధ్యాత్మిక విలువల పరిరక్షణ ప్రధాన లక్ష్యంగా ఈ సమావేశం కొనసాగింది. సమావేశంలో బ్రాహ్మణ సమాజ అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. యువతకు విద్యా, ఆర్థిక సహాయం అందించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజ ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. భాగ్యనగర బ్రాహ్మణ సొసైటీ అధ్యక్షురాలు వై. భవాని,కార్యదర్శి పి.ఎస్.ఎస్.ఎస్.వి ప్రసాద్, (వైష్ణవి ప్రసాద్) మాట్లాడుతూ..సభ్యులందరూ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## డబుల్ బెడ్‌రూమ్ వాసులు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### బొంగునూరు కిషోర్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, మే 17 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 278 డివిజన్, కైసర్ నగర్, గాజులరామారంలో నిర్వహించిన 40వ ఉచిత వైద్య శిబిరాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రోటోకాల్, కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూమ్ వాసులు ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వైద్య శిబిరంలో పాల్గొన్న రోగులకు అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రేమ్ కుమార్, గంట శివా రెడ్డి, రంజిత్ రెడ్డి, సరిత యాదవ్, వేణు, వలి, యాదగిరి, సునీల్, నర్సింహా రెడ్డి, సాధు యాదవ్, భరత్ రెడ్డి, ఉదయ్, రాకేష్, రితిక్, భీమ్, బికేఆర్ ఫౌండేషన్ సభ్యులు మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

# మృత్యు శకటాలుగా మారిన టిప్పర్లు..!!




**నారాయణపేట ప్రతినిధి, మే 16, (నినాదం):** మక్తల్ మండలం గొల్లపల్లి స్టేజి దగ్గర ఓవర్ లోడ్ తో వస్తున్న కర్ణాటక కు చెందిన టిప్పర్ ఢీకొనడంతో అక్కడికక్కడే ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మక్తల్ మండలం మంథన్ గోడ్ గ్రామానికి చెందిన సంఘం బండ హనుమంతు (60) అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై పని మీద వెళుతున్న క్రమంలో ఎదురుగా వచ్చిన టిప్పర్ డ్రైవర్ కంట్రోల్ తప్పడంతో ఎడమవైపు ముందు టైర్ అట్టి వ్యక్తిపై దూసుకుపోవడంతో నడుము భాగం వరకు టైర్ కింద చితికి పోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇప్పుడు జిల్లాలో హాట్ టాపిక్ గా మక్తల్ లో జరుగుతున్న అక్రమ ఒండ్రు మట్టి తరలింపు పై చర్చ జరుగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇంత జరుగుతున్నా అటువైపు కన్నెత్తి చూడని పోలీసులు, ఇరిగేషన్ అధికార యంత్రంపై పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. మంత్రి, ఎమ్మెల్యే ఇలాకాల్లో యదేచ్ఛగా అక్రమ వ్యాపారాలకు తెరలేపారని సామాజిక స్పృహ కలిగిన పౌర సమాజం కొన్నాళ్ళుగా గగ్గోలు పెడుతున్నప్పటికీ, అధికార యంత్రాంగం, పాలక పక్షం పట్టించుకోకుండా పెడచెవిన పెట్టడంతో యదేచ్ఛగా ప్రకృతి వనరుల దోపిడి జరుగుతున్నప్పటికీ అటువైపు కన్నెత్తి చూడని పోలీసులు, సంబంధిత అధికారులు, జిల్లాలో ధృతరాష్ట్ర పాలన నడుస్తుందంటూ పలువురు ఆరోపిస్తున్నారు. టిప్పర్ మాఫియా వ్యాపారులతో కొందరు కుమ్మక్కై సమయం లేదు మిత్రమా ప్రకృతిని సాధ్యమైనంత వరకు దోచుకుని ధ్వంసం చేసి నాలుగు రాళ్లు కూడా పెట్టుకోవాలనే సదుద్దేశంతో ముందుకు సాగి పోవాల్సిందే, విచ్చలవిడిగా తరలించాల్సిందే అనే పరుగు పందెంలో అమాయక ప్రజల ప్రాణాలను హరిస్తున్న సంఘటనలు గతంలో ఎన్నో జరిగినప్పటికీ, శనివారం నాడు మక్తల్ మండలం గొల్లపల్లి స్టేజి దగ్గర ఒండ్రు మట్టిని పోటాపోటీగా తరలిస్తున్న టిప్పర్ల కింద ఓ వ్యక్తి పడి చనిపోయిన సంఘటన చోటుచేసుకుంది. గతంలో మరికల్ మండల కేంద్రంలోని చౌరస్తాలో టిప్పర్ కింద ఓ ఉద్యోగి మరణించడం ధన్వాడ కేంద్రంలో కూడా ఇలాంటి సంఘటనలు జరగడం నారాయణపేట జిల్లా కేంద్రంలో కూడా ఇలాగే టిప్పర్ల కింద యువకులు పడి చనిపోవడం ఇలాంటి సంఘటనలు జరిగినప్పటికీ పంచాయతీలే పరమ విధి, కాసిన్ని కాసులు విదిలించి కేసుల నుండి తప్పించుకుంటున్న వైనం. స్వయంగా మంత్రి నియోజకవర్గంలోనే ఇలా జరుగుతూ ఉంటే.. ఇక వేరే ప్రాంతంలో చెప్పనక్కరలేదంటూ సామాజికవేత్తలు అంటున్నారు. జిల్లాలో ఇన్ని రకాల దోపిడీలు, ఇంతమంది ప్రజల ప్రాణాలు పోతున్న ఆ ప్రాణాలకు పంచాయతీ చేసి నయానో, భయానో ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు తప్ప వీటికి శాశ్వతమైన పరిష్కారాన్ని చూపలేకపోతున్నారని అధికారులపై, ప్రజా ప్రతినిధులపై పౌర సమాజం దుమ్మెత్తి పోస్తుంది. ఇంత మంది ప్రజల ప్రాణాలు హరిస్తున్న టిప్పర్ యజమానులపై గాని డ్రైవర్లపై గాని ఎలాంటి కఠినమైన కేసులు చేయకుండా అంతా యంత్రాంగం అలాంటి వ్యక్తుల వైపే ఉంటూ పంచాయతీలు చేస్తూ కేసులే కాకుండా చూడబట్టే భయము, బెదురు లేకుండా రోడ్లపై టిప్పర్లను తోలుతూ ప్రజల ప్రాణాలు హరిస్తున్నారు. ఈ ధృతరాష్ట్ర పాలనకు చరమగీతం పాడే యంత్రాంగం జిల్లాలో లేదా అంటూ పౌర సమాజం ప్రశ్నిస్తోంది.

## ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో ప్రజలు చురుకుగా పాల్గొని సహకరించాలి


- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**గద్వాల బ్యూరో మే 17( నినాదం):** ఓటరు జాబితాను పరిశుభ్రంగా, పారదర్శకంగా రూపొందించేందుకు భారత ఎన్నికల సంఘం ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా,అనర్హుల పేర్లు తొలగించే లక్ష్యంతో ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమం 25 జూన్ 2026 నుంచి ప్రారంభమై 01 అక్టోబర్ 2026న తుది ఓటరు జాబితా ప్రచురణతో ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 25 జూన్ నుంచి 24 జూలై వరకు ఇంటింటి సర్వే నిర్వహించి బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ముందుగానే ముద్రించిన ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారని చెప్పారు. అనంతరం 31 జూలై 2026న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసి,31 జూలై నుంచి 30 ఆగస్టు వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరిస్తారని తెలిపారు. 31 జూలై నుంచి 28 సెప్టెంబర్ వరకు విచారణలు, ధృవీకరణ ప్రక్రియ కొనసాగి,01 అక్టోబర్ 2026న తుది ఓటరు జాబితా ప్రచురిస్తారని వెల్లడించారు. ప్రతి ఓటరు తమకు అందించిన ఎన్యూమరేషన్ ఫారాన్ని జాగ్రత్తగా నింపి బి.ఎల్.ఓ లకు అందించాలని కలెక్టర్ సూచించారు. ఫారం నింపడంలో ఇబ్బందులు ఉంటే బి.ఎల్.ఓ లు సహాయం చేస్తారని తెలిపారు. ప్రతి ఇంటికి బి.ఎల్.ఓ లు కనీసం మూడు సార్లు వెళ్లి ఫారాల పంపిణీ,సేకరణ చేపడతారని పేర్కొన్నారు. ఓటరు ఇంట్లో లేని పరిస్థితిలో కుటుంబంలోని పెద్ద సభ్యుడు ఫారం నింపి సంతకం చేసి సమర్పించవచ్చన్నారు. ఎవరైనా ఎన్యూమరేషన్ ఫారం అందుకోకపోతే సంబంధిత బి.ఎల్.ఓ ను సంప్రదించవచ్చని, అలాగే అధికారిక వెబ్‌సైట్లు సీఈఓ తెలంగాణ మరియు ఓటర్స్ సర్వీస్ పోర్టల్ ద్వారా ఫారం పొందవచ్చని తెలిపారు. "బుక్ ఎ కాల్ విత్ బి.ఎల్.ఓ సదుపాయం కూడా అందుబాటులో ఉందన్నారు. ఓటర్లు తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో ఆన్‌లైన్‌లో తనిఖీ చేసుకోవచ్చని తెలిపారు. 2002 ప్రత్యేక సవరణ జాబితాలో పేరు లేకపోయినా, 2024 ఎన్నికల్లో ఓటు వేసిన వారు తమ తల్లిదండ్రులు లేదా తాతముత్తాతల వివరాలను నమోదు చేసి దీూా బిఎల్ఓ సహాయంతో వివరాలు గుర్తించుకోవచ్చన్నారు. ఇంటి చిరునామా మారిన ఓటర్లు 31 జూలై 2026 తర్వాత ఫారం-8 ద్వారా చిరునామా మార్పు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ మార్పులు క్లెయిమ్స్ మరియు అభ్యంతరాల కాలంలో పరిశీలించి తుది జాబితాలో చేర్చబడతాయని చెప్పారు. 18 సంవత్సరాలు పూర్తి చేసిన యువత ఫారం-6 ద్వారా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. 01 అక్టోబర్ 2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తిచేసుకునే వారు కూడా బి.ఎల్.ఓ ల ద్వారా ఫారం-6 తీసుకుని దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎన్యూమరేషన్ ఫారం సమర్పించేందుకు ఆధార్ కార్డు తప్పనిసరి కాదని,ఓటరు ఇష్టపడితే మాత్రమే ఆధార్ నంబర్ నమోదు చేయవచ్చని స్పష్టం చేశారు. ఫారంలో ముద్రించిన ఫోటో పాతదిగా లేదా తప్పుగా ఉంటే తాజా ఫోటో జతచేసి సమర్పించాలని సూచించారు. ఇతర రాష్ట్రాలు,నగరాలు లేదా విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్న ఓటర్ల తరఫున కుటుంబ సభ్యులు ఫారం సమర్పించవచ్చని తెలిపారు. కుటుంబమంతా బయట ఉన్న పరిస్థితిలో ఆన్‌లైన్ సదుపాయం ద్వారా ఎన్యూమరేషన్ ఫారం సమర్పించవచ్చన్నారు. ఓటర్లు అందరూ ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని సరైన వివరాలు అందించాలని తద్వారా పారదర్శకమైన,ఖచ్చితమైన ఓటరు జాబితా తయారీలో సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## కాలనీల అభివృద్ధికి కృషిచేస్తా.

- బస్తీబాట కార్యక్రమంలో బికేఆర్



**కుత్బుల్లాపూర్, మే 17 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బహదూర్ పల్లి డివిజన్ గ్రీన్ హిల్స్ కాలనీలో రాష్ట్ర ప్రోటోకాల్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి మార్నింగ్ వాక్ బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు. కాలనీ అధ్యక్షులు, కాలనీ ప్రజలతో కలిసి గ్రీనీస్ కాలనీ లో ఉన్న డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లను పరిశీలించి కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీలో నెలకొని ఉన్న డ్రైనేజీ, రోడ్డు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రతిరోజు బస్తీ బాట కార్యక్రమం నిర్వహిస్తూ బహుదూర్ పల్లి డివిజన్ లోని ఉన్న ప్రతి ఒక్క కాలనీలను సందర్శించి నేరుగా ప్రజల సమస్యలు తెలుసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బొంగునూరి కిషోర్ కిషోర్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఏఆర్ సాధు యాదవ్, వేణు కుమార్, ప్రవీణ్ ముదిరాజ్ ,కాలనీ అధ్యక్షులు అమర్ పటేల్, దామోదర్, రాజిరెడ్డి, రాజశేఖర్, వీరన్న, బీరప్ప, చంద్రయ్య, శ్రీనివాస్, కమిటీ సభ్యులు, కాలనీ ప్రజలు పాల్గొనడం జరిగింది.

इंडियन बैंक Indian Bank
इलाहाबाद ALLAHABAD
స్ట్రెస్డ్ అసెట్స్ మేనేజ్‌మెంట్ లార్జ్ బ్రాంచ్
5-1-679, సురభి ఆర్కేడ్, బ్యాంక్ స్ట్రీట్, కోఠి, హైదరాబాద్-500001.
Phone: 040-24651169 Email: armbhyderabad@indianbank.co.in

**సవరణ**

నెల్లూరులోని ముత్తుకూరు గ్రామంలోగల పైన పేర్కొన్న ఆస్తికి (ఆస్తిఐడి నెం: IDIBSAMHPR20) సంబంధించి, మంగళవారం, మే 13, 2026న "బిజినెస్ స్టాండర్డ్" ఆంగ్ల దినపత్రికలోనూ, అలాగే మంగళవారం, మే 13, 2026న 'నినాదం' తెలుగు దినపత్రిక (హైదరాబాద్ ఎడిషన్) మరియు 'ప్రజాశక్తి' తెలుగు దినపత్రిక (నెల్లూరు ఎడిషన్)లలో ప్రచురించబడిన మా ఈ-వేలం ప్రకటనను దయచేసి పరిశీలించండి.
మెసర్స్ ప్రత్యూష రిసోర్సెస్ & ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించి, పైన పేర్కొన్న అమ్మకపు ప్రకటనను బ్యాంక్ ఉపసంహరించుకుందని దీని ద్వారా తెలియ జేయడమైనది. అలాగే, నెల్లూరులోని ముత్తుకూరు గ్రామంలోగల పైన పేర్కొన్న ఆస్తికి (ఆస్తి ఐడి నెం: IDIBSAMHPR20) సంబంధించి, సవరించిన అమ్మకపు ప్రకటనను మే 18, 2026న పైన పేర్కొన్న దినపత్రికలలో ప్రచురించడం జరిగింది.

తేది: 16-05-2026 సం/- అధీకృత అధికారి,
ప్రదేశం: హైదరాబాద్ ఇండియన్ బ్యాంక్

इंडियन बैंक Indian Bank
इलाहाबाद ALLAHABAD
స్ట్రెస్డ్ అసెట్స్ మేనేజ్‌మెంట్ లార్జ్ బ్రాంచ్
5-1-679, సురభి ఆర్కేడ్, బ్యాంక్ స్ట్రీట్, కోఠి, హైదరాబాద్-500 001.
Phone: 040-24651169 Email: armbhyderabad@indianbank.co.in

**అనుబంధం-IX**
**అనుబంధం- IV-A (రూల్ 8(6)కు నియమం చూడండి)**
**స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన**

ది సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూలు 8(6)కు నియమాలతో చదువబడే ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన.
ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకించి రుణగ్రహీత(లు) మరియు హామీదారు(ల)కు ప్రకటన ఇవ్వడమేమనగా, సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తాకట్టుపెట్టబడినది/ చార్జ్ చేయబడిన దిగువ వివరించబడిన స్థిరాస్తి, ఇండియన్ బ్యాంక్, ఎస్ఏఎం బ్రాంచ్, హైదరాబాద్ యొక్క అధీకృత అధికారి ద్వారా భౌతికంగా/ నిర్మాణాత్మ కంగా (లాంఛనప్రాయంగా) (ఏది వర్తిస్తుందో అది) ద్వారా స్వాధీనం చేసుకోబడినది, దానిని సెక్యూర్డు క్రెడిటర్ వారు మెసర్స్ ప్రత్యూష రిసోర్సెస్ & ఇన్‌ఫ్రా (ప్రై) లిమిటెడ్, (లిక్విడేషన్ ప్రక్రియలో ఉన్న కంపెనీని, కొనసాగుతున్న సంస్థగా అమ్మారు), రుణగ్రహీత మరియు హామీదారు(లు): (1) శ్రీ.పరుచూరి రాజారావు (డైరెక్టర్ &హామీదారు), తండ్రి శివ రామయ్య, కెరాఫ్ ప్రత్యూష రిసోర్సెస్ అండ్ ఇన్‌ఫ్రా (ప్రై) లిమిటెడ్, డి-1, తిరువిక ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032, (2) శ్రీ.పరిచూరి వెంకయ్య ప్రభాకర రావు (డైరెక్టర్ &హామీదారు), తండ్రి పి.వెంకయ్య నాయుడు, హెచ్ఐజి-231,సెక్టార్-4, ఎంవిపి కాలనీ, విశాఖపట్నం-530017, (3) శ్రీ.పి.వి.భాస్కరరావు (హామీదారు), తండ్రి పి.వెంకయ్య నాయుడు, హెచ్ఐజి-231, సెక్టార్-4, ఎంవిపి కాలనీ,విశాఖపట్నం-530017, (4) శ్రీ గంట శ్రీనివాసరావు (హామీదారు), తండ్రి చిన్నరోశయ్య, హెచ్ఐజి- 231, సెక్టార్-4, ఎంవిపి కాలనీ, విశాఖపట్నం-530017, (5) శ్రీ. కొండయ్య బాల సుబ్రమణ్యం (హామీదారు), తండ్రి కొండయ్య, ప్లాట్‌నెం.26, ఎంఐజి, సెక్టార్-5, ఎంవిపి కాలనీ, విశాఖపట్నం-530017, (6) శ్రీమతి నార్ని అమూల్య (హామీదారు), తండ్రి(లేట్) ఎన్.సాంబ శివ రావు, ఫ్లాట్‌నెం.2, త్రివేణి టవర్స్, బాలయ్య శాస్త్రి లేఅవుట్, సీతమ్మధార, విశాఖపట్నం-500013, (7) మెసర్స్ ప్రత్యూష ఎస్టేట్స్(ప్రై) లిమిటెడ్ (హామీదారు), డోర్ నెం.25-40-12, ప్రత్యూష హౌస్, గంగులవారి వీధి, విశాఖపట్నం-530001, (9) మెసర్స్ ప్రత్యూష గ్లోబల్ ట్రేడ్(ప్రై) లిమిటెడ్ (హామీదారు), డోర్‌నెం. 25-40-12, ప్రత్యూష హౌస్, గంగులవారి వీధి, విశాఖపట్నం-530001 నుండి ఇండియన్ బ్యాంక్, ఎస్ఏఎం బ్రాంచ్, సెక్యూర్డు క్రెడిటర్‌కు బకాయిలు రూ.514,38,53,392.89 (రూపాయలు ఐదు వందల పద్నాలుగు కోట్ల ముప్పైఎనిమిది లక్షల యాభై మూడు వేల మూడు వందల తొంభై రెండు &ఎనభై తొమ్మిది పైసలు మాత్రమే) (30.04.2026 నాటికి)ల రికవరీ కొరకు 05-06-2026న "ఎక్కడ ఎలాఉన్నది మరియు అక్కడ అలాగే మరియు ఉన్నది ఉన్నట్లు" ప్రతిపాదికన విక్రయించబడును. ఇ-వేలం విధానం ద్వారా విక్రయించదానికి ఉద్దేశించిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు క్రింద ఇవ్వబడ్డాయి.
**ఆస్తి యొక్క వివరణాత్మక వివరణ:**
మెసర్స్ ప్రత్యూష అసోసియేట్స్ షిప్పింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వారి పేరునగల నెల్లూరుజిల్లా, ముత్తుకూరు మండలం, ముత్తుకూరు గ్రామం, సర్వే నెం.409 మరియు 414లోని మొత్తం 7.72 1/2 ఎకరాల భూమిపై ఈఎం. (పత్రం నెం.340/2007, 341/2007 ప్రకారం)
**ఐటం నెం.1:** మెసర్స్ ప్రత్యూష అసోసియేట్స్ షిప్పింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వారి పేరునగల నెల్లూరు జిల్లా, ముత్తుకూరు మండలం, ముత్తుకూరు గ్రామం, సర్వే నెం.409లోని 4.98 ఎకరాల భూమిపై ఈఎం. (పత్రం నెం.341/2007 ప్రకారం). **సరిహద్దులు:** తూర్పు: ఎస్‌కెఅబ్దుల్ ఖాదర్ సాహెబ్ భూమిలో కొంత భాగం, పడమర: దొంక, ఉత్తరం: ఉమ్మడి దొంక, దక్షిణం: శ్రీ చెన్నకేశవ దేవస్థానం భూమి.
**ఐటం నెం.2:** మెసర్స్ ప్రత్యూష అసోసియేట్స్ షిప్పింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వారి పేరునగల నెల్లూరు జిల్లా, ముత్తుకూరు మండలం, ముత్తుకూరు గ్రామం, సర్వే నెం.414లోని 2.74 1/2 ఎకరాల భూమిపై ఈఎం. (పత్రం నెం.340/2007 ప్రకారం). **సరిహద్దులు:** తూర్పు: అన్నవరపు కాశీవిశ్వనాథం భూమి, పడమర: ప్రత్యూష అసోసియేట్స్ షిప్పింగ్ ప్రైవేట్ లిమిటెడ్ భూమిలో కొంత భాగం, ఉత్తరం: ఎస్.కె.అబ్దుల్ ఖాదర్ సాహెబ్ భూమి, దక్షిణం: వేదిచర్ల రమణమ్మ మరియు ఇతరుల భూమిలో కొంత భాగం.

| | |
|---|---|
| బ్యాంకుకు తెలిసిన రుణభారాలు | నిల్ |
| రిజర్వ్ ధర | Rs. 1,74,00,000/- |
| ఈఎండి మొత్తం | Rs. 17,40,000/- |
| బిడ్ పెంపుదల మొత్తం | Rs. 25,000/- |
| ఇ-వేలం తేది & సమయం | 05.06.2026, 11 am to 4 pm |
| ఆస్తి ఐడి నెంబర్ | IDIBSAMHPR20 |

ఆన్‌లైన్ బిడ్‌లో పాల్గొనడానికి, బిడ్డర్లు మా ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ అలయన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారి వెబ్‌సైట్ (https://baanknet.com)ను సందర్శించాలని సూచించడమైనది. సాంకేతిక సహాయం కోసం దయచేసి నెం.8291220220 పై కాల్ చేయండి.
రిజిస్ట్రేషన్ స్టేటస్ మరియు ఈఎండి స్థితి కోసం దయచేసి support.ebkray@psballiance.com కు ఇమెయిల్ చేయండి.
ఆస్తి వివరాలు, ఆస్తి ఫోటోగ్రాఫ్ మరియు వేలం నిబంధనలు మరియు షరతుల కోసం దయచేసి https://baanknet.com ను సందర్శించండి మరియు ఈ పోర్టల్‌కు సంబంధించిన సందేహాల నివృత్తి కోసం, దయచేసి మెసర్స్ అలయన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారిని సంప్రదించండి, సంప్రదింపు నెం. 8291220220.
బిడ్డరుదారులు https://baanknet.com వెబ్‌సైట్‌లో ఆస్తిని వెతుకుతున్నప్పుడు, పైన పేర్కొన్న ప్రాపర్టీ ఐడి నంబర్‌ను ఉపయోగించాలని సూచించడమైనది.
*బ్యాంకుకు తెలిసినంత వరకు ఎటువంటి ఆటంకాలు లేవు. అయితే, బిడ్ వేయాలనుకునే బిడ్డర్లు, బిడ్ సమర్పించే ముందు, వేలం కోసం ఉంచిన ఆస్తులపై ఉన్న రుణభారం, యాజమాన్య హక్కు మరియు ఆస్తిని ప్రభావితం చేసే క్లెయిమ్‌లు/హక్కులు/బకాయిల గురించి తమ సొంతంగా విచారణ చేసుకోవాలని సూచించడమైనది.

తేది: 06-05-2026 సం/- అధీకృత అధికారి,
ప్రదేశం: హైదరాబాద్ ఇండియన్ బ్యాంక్

సంప్రదించు వ్యక్తి: 1) శ్రీ రోహిత్ రంజన్ -అధీకృత అధికారి: 9304541787
2) శ్రీ.నిశాంత్ శుక్లా- ఐఎం: 9454488755

SBI
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
రిటైల్ అస్సెట్స్ & స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ సిటీ క్రెడిట్ సెంటర్
హెచ్.నెం. 1-7-1276/3, మెయిన్‌రోడ్డు, అడ్వకేట్స్ కాలనీ,
హన్మకొండ. ఫోన్: 0870-2424705 Email: Sbi.21018@Sbi.co.in

**స్వాధీనత ప్రకటన**

(అనుబంధం-IV)
సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్ 8(1) క్రింద
(స్థిరాస్తి కొరకు)

**(1) Home Loan A/C No. 36190243426, (2) Home- Top-Up: 36190229717**
**(3) Home-Top-Up: 40400315123**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారము **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, RASMECCC-21018, హన్మకొండ** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 నందలి సెక్షన్ 13(2)తో చదువుకొనే అనుబంధమైన నిబంధన 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత(లు): 1) శ్రీ సాంబరాజు కనకరాజు, తండ్రి: లక్ష్మయ్య, 2) శ్రీ సాంబరాజు శ్యామ్‌రాజు, తండ్రి: లక్ష్మయ్య, 3) శ్రీ సాంబరాజు కిరణ్, తండ్రి: లక్ష్మయ్య,** హెచ్.నెం. 6-7-112, ధోబీవాడ, రాగన్న దర్వాజ, ఎనుమాముల, హన్మకొండ, వరంగల్- 506001 వారిని నోటీసులో ఉదహరించబడిన **దీ.11-03-2026 నాటికి రూ.35,22,538/- (అక్షరాల ముప్పై ఐదు లక్షల ఇరవై రెండు వేల ఐదు వందల ముప్పై ఎనిమిది రూపాయలు మాత్రమే) + వడ్డీ & ఖర్చులు** సదరు నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **దీ.11-03-2026న డిమాండ్ నోటీసు జారీచేయబడినది.**
ఋణగ్రహీతలు / హామీదారులు బకాయిసొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఋణగ్రహీతలు / హామీదారులు మరియు సాధారణ ప్రజానీకమునకు నోటీసు ఇచ్చి, ఈ దిగువ సంతకందారుడు సదరు చట్టములోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూలు 8 ప్రకారము **12వ తేదీ మే 2026 న** దిగువ పేర్కొన్న ఆస్తిని **సింబాలిక్ స్వాధీనత తీసుకోవడమైనదని** ఇందుమూలముగా తెలియజేయడమైనది.
ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా బ్యాంకు వారికి **దీ.12.05.2026 నాటికి రూ.35,78,593/- (అక్షరాల ముప్పై ఐదు లక్షల డెబ్భై ఎనిమిది వేల ఐదు వందల తొంభై మూడు రూపాయలు మాత్రమే) + 13.05.2026 తేదీనుండి వడ్డీ & ఖర్చులు** మొ॥నవి **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, RASMECCC-21018, హన్మకొండ** వారి ఛార్జీకి లోబడి ఉండునని ఇందుమూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీత / హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

**స్థిరాస్తి యొక్క వివరములు**

**ఆస్తి యొక్క షెడ్యూలు: వరంగల్ రిజిస్ట్రేషన్ జిల్లా మరియు రెవెన్యూ, వరంగల్ సబ్-రిజిస్ట్రార్ యొక్క న్యాయపరిధిలో 22-04-2010 తేదీగల దస్తావేజు నెం.3148/2010 ప్రకారము 1) శ్రీ సాంబరాజు కనకరాజు, తండ్రి: లక్ష్మయ్య, 2) శ్రీ సాంబరాజు శ్యామ్‌రాజు, తండ్రి: లక్ష్మయ్య, 3) శ్రీ సాంబరాజు కిరణ్, తండ్రి: లక్ష్మయ్య పేరునగల ఆస్తి.** గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ లిమిట్స్, హన్మకొండ, రాగన్న దర్వాజ, మునిసిపల్ డోర్ నెం.6-7-112, ధోబీవాడ నందు 150.00 చ॥గ॥లకు సమానమైన 126.00 చ॥మీ॥ విస్తీర్ణములోని ఆర్‌సిసి రూఫ్ రెసిడెన్షియల్ GWMC ఇంటి నెం. 6-7-112 కు సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు: **తూర్పు:** 5' లేన్; **పడమర:** లేన్; **ఉత్తరం:** యస్.లక్ష్మయ్య యొక్క ఖాళీ ప్రదేశము; **దక్షిణం:** జి.చేరాలు యొక్క ఇంటి నెం.6-7-113.

తేది: 12-05-2026 సం/- అధీకృత అధికారి
ప్రదేశం: హన్మకొండ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

## ఐకమత్యంతో ఉంటేనే అభివృద్ధి

### బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే వివేకానంద్



**కుత్బుల్లాపూర్, మే 17 (నినాదం):** కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద 131 – కుత్బుల్లాపూర్ డివిజన్ చెరుకుపల్లి కాలనీ నూతన సంక్షేమ సంఘం సభ్యులు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐకమత్యంతో ఉంటేనే కాలనీ అభివృద్ధి సాధ్యమని అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని మిగతా ప్రాంతాలతో పాటు చెరుకుపల్లి కాలనీలో ఎన్నో కోట్ల నిధులతో అభివృద్ధి పరిచామని, కాలనీ అభివృద్ధికి రానున్న రోజుల్లో సహితం సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. చెరుకుపల్లి కాలనీ నూతన సంక్షేమ సంఘం అధ్యక్షులు జె.వెంకటేష్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి వేణు, ముఖ్య సలహాదారులు ఎం. క్రిస్ట్ దాస్, సలహాదారులు జి. లక్ష్మణ్, బి. సత్యనారాయణ రెడ్డి, యూ. శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు టీ. అమరేందర్, అంజన్ కుమార్ యాదవ్, కన్వీనర్లు గణేష్, ప్రదీప్ గౌడ్, సంయుక్త కార్యదర్శి వి.ఎస్.నవీన్, అబ్దుల్ మన్సూర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ దిలీప్ గౌడ్, సాయి కిషోర్, సభ్యులు శశికాంత్ యాదవ్, రాజేష్, తనయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## వారసత్వ సంపదకు నిలయాలు
# మ్యూజియంలు

### మే 18...అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం

అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం, ప్రతి సంవత్సరం మే 18న నిర్వహించ బడుతోంది. అంతర్జాతీయ స్థాయిలో, సమాజ అభివృద్ధిలో మ్యూజియంల పాత్రపై ప్రజల్లో అవగాహన పెంచడానికి ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు.
సంగ్రహాలయం లేదా మ్యూజియం అంటే సమాజా వసరాలకోసం, జన బాహుళ్యానికి ప్రవేశ సదుపాయం కలిగిన సంస్థ. ఇది కళాఖండాలు, కళాత్మక, సాంస్కృతిక, చరిత్రాత్మక లేదా ఇతర వస్తువుల సేకరణ గావి స్తుంది. సంగ్రహాలయాలు మానవ జాతికి సంబంధించిన దృశ్య, అదృశ్య వారసత్వ సంపద విషయాలను భద్రపరుస్తాయి. సేకరించిన వస్తువులను శాశ్వత మైన లేదా తాత్కాలికమైన ప్రదర్శనల ద్వారా ప్రజల వీక్షణకు అందుబాటులో ఉంచుతాయి.
మ్యూజియం అనేది మొత్తం ప్రపంచం, పరిణామం, నగరాల సంస్కృతి అభివృద్ధి, మొత్తం దేశాల జీవితం, శాస్త్రీయ మరియు సాంకేతిక పురోగతి, కళ మరియు చరిత్రను గుర్తించగల ఒక ప్రత్యేక భాగం.

ఎడిటోరియల్

మ్యూజియంలు మానవ జాతి చరిత్ర, దాని విలువలు మరియు సాంస్కృతిక వారసత్వం యొక్క సంరక్షణ కేంద్రాలు. ఒక నిర్దిష్ట కాలంలో నివసించిన, సృష్టించిన, నాశనం చేయబడిన ప్రతిదీ మ్యూజియం ప్రదర్శనల రూపంలో జాగ్రత్తగా భద్రపరచ బడుతుంది. ప్రజలకు వివిధ అంశాలలో అవగాహన కల్పించ డానికి మ్యూజియం ఒక మార్గంగా నిలుస్తుంది. వాస్తవానికి మ్యూజి యం అనేది లాభాపేక్షలేని, సమాజం, దాని అభివృద్ధికి సేవ చేసే శాశ్వత సంస్థ, ఇది ప్రజలకు ప్రజలకు అందుబాటులో ఉండి, వివిధ అపూర్వ, అపురూప వస్తువు లను సేకరిస్తుంది, సంరక్షిస్తుంది, పరిశోధిస్తుంది, వారసత్వాన్ని అందిస్తుంది.
ప్రాచీన గ్రీకులు, రోమన్లు కళలు, వస్తువులను సేకరించి ప్రదర్శిం చారు. పురాతన కాలంలో లైబ్రరీలు మరియు మ్యూజియంల మధ్య చాలా తక్కువ భేదం ఉండేది.
ప్రారంభ సంగ్రహాలయాలు సంపన్న వ్యక్తులు, కుటుంబాలు లేదా కళాసంస్థలు, అరుదైన లేదా ఆసక్తికరమైన సహజ వస్తువులు, కళాఖండాల ప్రైవేట్ సేకరణలుగా ప్రారంభమయ్యాయి. ఒకనాటి రాజభవనాలు కళలు, వారు స్వాధీనం చేసుకున్న ప్రాంతాల నుండి వస్తువులు, ఇతర రాజ్యాల రాయబారుల బహుమతులతో రూపొందించబడిన ఒక రకమైన మ్యూజియంగా కూడా పని చేశాయి. ఫ్రాన్స్‌లో, మొదటి పబ్లిక్ మ్యూజియం పారిస్‌లోని లౌవ్రే మ్యూజియం, 1793 లో ఫ్రెంచ్ విప్లవం సమయంలో ప్రారంభించ బడింది.
బ్రిటీష్ మ్యూజియం 19వ శతాబ్దం లో బాగా ప్రాచుర్యం పొందింది. ప్రభుత్వ సెలవు దినాలలో బ్రిటీష్ మ్యూజియాన్ని సందర్శించే అవకాశం కల్పించారు. నెపోలియన్ ఐరోపాలోని గొప్ప నగరాలను జయించగా , ఆయన అక్కడి కళా వస్తువులను స్వాధీనం చేసుకున్నాడు. అలా సేకరణలు పెరిగాయి. రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభా నికి ముందే యునైటెడ్ స్టేట్స్‌లో విశ్వ విద్యాలయాలు వినూత్న పరిశోధనలకు ప్రాథమిక కేంద్రాలు గా మారాయి. అనేక దేశాలలో ప్రకృతి వైపరీత్యాలు , యుద్ధం , తీవ్రవాద దాడులు లేదా ఇతర పరిస్థితుల కారణంగా మ్యూజియం లలో నిల్వ చేయబడినసాంస్కృతిక ఆస్తికి ముప్పు వాటిల్లింది.
1946లో కౌన్సిల్ ఆఫ్ మ్యూజియమ్స్ "ఐకామ్" (ICOM) అనే ప్రత్యేక సంస్థ స్థాపించబడింది. వందకు పైగా దేశాల ప్రతినిధులు ఇందులో చేరారు. అప్పుడు, 11వ సాధారణ సమావేశంలో, సోవి యట్ ప్రతినిధి బృందం అంతర్జా తీయ మ్యూజియం దినోత్సవాన్ని మే 18న జరుపు కావాలని నిర్ణయించారు. సోవియట్ యూనియన్ తో సహా 115 కంటే ఎక్కువ దేశాల ప్రతినిధులు వెంటనే కౌన్సిల్ చేరాయి. సోవియట్ యూనియన్ చొరవతో ఐకామ్ 1977లో ప్రపంచ మ్యూజియం దినోత్సవాన్ని నిర్వహించింది. 1978లో తొలిసారిగా వేడుకలు ప్రపంచం లోని 150 దేశాలలో విస్తృతంగా జరిగాయి. ప్రజల మధ్య సాంస్కృతిక మార్పిడి, పరస్పర సహకారం, శాంతి పట్ల అవగాహన కల్పించే దుకు ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ మ్యూజియమ్స్ (ఐకామ్) సర్వప్రతినిధి సభ తీర్మానం ప్రకారం ఏటా మే నెల 18వ తేదీని అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవంగా జరుపుకోవాలని 1977లో నిర్ణయించారు. మ్యూజియం నిపుణులు ప్రజలను కలవడానికి, మ్యూజియంలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వారిని తెలియ చేయడానికి ఈ దినోత్సవం ఉపయోగ పడింది. 1978 నుండి, అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవాన్ని రష్యాతో సహా, ఉక్రెయిన్, బెలారస్, జర్మనీ, ఫ్రాన్స్, గ్రేట్ బ్రిటన్‌తో సహా ప్రపంచంలోని 150 కంటే ఎక్కువ దేశాలలో మే 18 న అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం జరుపుకుంటున్నారు. 2009లో ఎక్కువ మందిని దృష్టిని ఆకర్షించింది. 2009లో జరిగిన అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం వేడుకల్లో 90కి పైగా దేశాలలో 20,000 మ్యూజియంలు వివిధ కార్యక్రమా లను నిర్వహించింది. 2010లో 98 దేశాలు, 2011లో 100 దేశాలు, 2012లో 129 దేశాలలో 30,000 మ్యూజియంలు ఈ వేడుకలో పాల్గొన్నాయి. 2011లో ఈ దినోత్సవ అధికారిక పోస్టర్ 37 భాషలలోకి అనువదించబడింది. 2012 నుండి ఈ సంఖ్య 38కి పెరిగింది.
ప్రపంచ వ్యాప్తంగా ఆర్ట్ మ్యూజియంలు,నేచురల్ హిస్టరీ మ్యూజియంలు, సైన్స్ మ్యూజియంలు, వార్ మ్యూజియంలు, పిల్లల మ్యూజియం లతో సహా అనేక రకాల మ్యూజియంలు ఉన్నాయి. ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ మ్యూజియమ్స్ ఐకామ్ ప్రకారం , 202 దేశాలలో 55,000 కంటే ఎక్కువ మ్యూజియంలు ఉన్నాయి.


**రామ కిష్టయ్య సంగన భట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్**
**9440595494**

## స్త్రీ స్వేచ్ఛకు ప్రతిబింబం...
# గుడిపాటి వెంకటచలం

**తెలుగు సాహిత్యంలో సాంప్రదాయానికి మించిన ప్రశ్నించే ధోరణి, ఆత్మ పరిశీలనతో కూడిన తాత్వికతకు ప్రతీకగా నిలిచిన రచయిత గుడిపాటి వెంకట చలం. ఆయన రచనలు నాటి తెలుగు సమాజాన్ని గణనీయంగా కదిలించాయి. స్త్రీల జీవితాలలోని మౌనాన్ని గొంతెత్తించి మాట్లాడించిన మానవతావాది, భావ చిత్రకారుడు చలం సాహిత్య జీవితం అనేక ధీమతులకి మూల పునాది. ఆత్మవేదన రచయిత అయిన చలం కలం ద్వారా ఆడవారి బాధలకు స్వరం వచ్చిందంటే అతిశయోక్తి కాదు. చలం రాసిన ప్రతి పంక్తిలో ఒక ఆత్మ అన్వేషణ, ఒక్కో వాక్యంలో ఒక తాత్విక యాత్ర దర్శనమిస్తుంది.**

1894 మే 18న మద్రాసు ప్రెసిడెన్సీ లోని వల్లూరి పాలెంలో జన్మించిన చలం, సంపన్న బ్రాహ్మణ కుటుంబానికి చెందినవారు. తండ్రి కొమ్మూరి సాంబశివరావు, తల్లి వేంకట సుబ్బమ్మ. కానీ తన తాత గుడిపాటి వెంకట రామయ్య దత్తత తీసుకోవడంతో "గుడిపాటి" ఇంటిపేరు అయింది. బాల్యంలోనే ఇతిహాస, పురాణాలపై ఆసక్తి పెరిగింది. తండ్రి తల్లిపై చూపిన కఠినత, చెల్లెలి బాల్యవివాహం వంటి అనుభవాలు అతని లోపల ఒక ప్రశ్నించే మానసికతకు బీజం వేశాయి.

1911లో పిఠాపురం మహారాజా కళాశాలలో చేరిన చలం, అక్కడి బ్రహ్మ సమాజ ప్రభావిత మేధావి రఘుపతి వెంకటరత్నం నాయుడు ద్వారా బ్రహ్మ వాదానికి ఆకర్షితుడయ్యాడు. తరువాత మద్రాసులో బి.ఎ. చదువుతుండగా, భార్య రంగనాయకమ్మను సెయింట్ థామస్ కాన్వెంట్ స్కూల్‌లో చేర్పించి, ఆమెను



స్వయంగా కాలేజీకి తీసుకెళ్లేంత పురోగామి మానసికత ఉన్న వ్యక్తిగా చలం కనిపించారు. ఇది అప్పటి సమాజంలో సాహసమే!

కాకినాడ కళాశాల ట్యూటర్‌గా ఉద్యోగం చేస్తున్నప్పుడు చలాన్ని వ్యక్తిగతంగా, సాహిత్యంగా మలచింది. రాజమండ్రిలో ఉండగా ఆలోచనల కోసం అద్దె ఇల్లు దొరకక పోవడం, పశువుల పాకలో నివాసం ఉండడం... ఇవన్నీ అతని నిరాశ, విప్లవాన్ని సంకేతాలుగా నిలిచాయి.

ఇటీవలికాలంలో కూడా చలం రచనలు చదివితే – "మైదానం", "బ్రాహ్మణీకం", "అమీనా", "సావిత్రి" – ప్రతి నవలలో ఒక నిజమైన స్త్రీ క్షోభ, విముక్తి కోసం కొట్టుకుంటున్న హృదయ ధ్వని వినిపిస్తుంది. ఆయన వ్యాసాలు, కథలు, ఆత్మకథ "జీవిత యాత్ర"లో ఆయుధాల్లాంటి పదబలంగా నిలిచాయి.

ఆయన శైలి ప్రత్యేకం. అశ్లీలతగా అభ్యంతరాలు వచ్చినా ఆయన రాసినది అసత్యం కాదు. అది అప్పటి నమ్మకాల నరాలను వేధించే నిజం. ఆయన వాక్యాలు సహజమైనా, వాటిలోని భావం ఆలోచన కలిగించేది. తాత్వికత, ప్రేమ, స్వేచ్ఛ – ఈ మూడు ఆయన రచనలకు మూలాధారాలు.

అప్పటి సమాజం ఆయనను విమర్శించినా, చలం పట్టించుకోలేదు. టాగోర్, వివేకానంద, బ్రహ్మ సమాజ భావజాలంతో మానవతా విలువలు ఆయనకు బలాన్ని ఇచ్చాయి. చలం తన ఆత్మ విచారణను మాత్రమే కాదు, సమాజానికి అవసరమైన ప్రశ్నల్ని కూడా కలం ద్వారా లేఖనం చేశాడు.

1979 మే 4న చలం తిరువన్నామలైలో తాత్వికతలో లీనమై ప్రశాంతంగా మరణించారు. శేషజీవితాన్ని "అహం" ను అంగీకరించకుండా గడిపారు. అదే ఆయన తత్వచింతనకు పరాకాష్ఠ.

గుడిపాటి వెంకట చలం జీవితం ఒక విప్లవ సంచిక. ఆయన రచనలు సమాజానికి నీతులు చెప్పే రచనలు కావు. అవి ఆత్మ పరిశీలనకి ప్రేరణలు, స్వేచ్ఛ కోసం పోరాడే కలం పదాలు. స్త్రీలను పునఃపరిశీలించే దృష్టిని తెలుగు పాఠకులకు కల్పించిన ధైర్యవంతుడు చలం. నేటికీ ఆయన రచనలు చదివితే – మనలో ఉన్న సంప్రదాయాల మూలాలను ప్రశ్నించే శక్తి కలుగుతుంది. చలం... ఒక రచయిత కాదు, ఒక మానవతా భావం.

**రామ కిష్టయ్య సంగన భట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్**
**9440595494**

# చికిత్స లేని ఎయిడ్స్‌కు నివారణే మార్గం!

## (18 మే "ప్రపంచ ఎయిడ్స్ టీకా దినం" సందర్భంగా)

**ఏయిడ్స్ (అక్వైర్డ్ ఇమ్యూనో-డెఫిసియన్సీ సిండ్రోమ్) వ్యాధికి కారణమైన హెచ్ఐవి (హ్యూమన్ ఇమ్యూనో వేరస్) వైరస్ బయట పడి మూడు దశాబ్దాలు దాటింది. హెచ్ఐవి-ఏయిడ్స్‌కు కొంత వరకు చికిత్స, నివారణ మార్గాలు ఉన్నప్పటికీ నేటికీ ఒక నిర్దిష్టమైన టీకా అందుబాటులోకి రాలేదు. ఏ క్షణంలోనైనా హెచ్ఐవి-ఏయిడ్స్ టీకా అందుబాటులోకి రావచ్చని పరిశోధకులు, వైద్యులు, వైద్య ఆరోగ్య నిపుణులు వాగ్దానం చేస్తున్నప్పటికీ ఆ టీకా వార్త మాత్రం సత్యదూరంగానే కనిపిస్తున్నది. హెచ్ఐవి-ఏయిడ్స్ నేటికీ ఒక ప్రధాన ప్రజారోగ్య సమస్యగా పౌర సమాజాన్ని పట్టి పీజిస్తున్నది. నేటికీ దక్షిణ ఆఫ్రికాలో 7.7 మిలియన్ల హెచ్ఐవి-ఏయిడ్స్ రోగులు ఉన్నారని, ప్రపంచవ్యాప్తంగా 39.9 మిలియన్ల అభాగ్యులు దీని విషవలయంలో చిక్కి ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవిస్తున్నారని తెలుసుకోవాలి. నేడు హెచ్ఐవి సోకిన వారికి "ఆంటీ-రిట్రో వైరల్ థెరపీ" అందుబాటులో ఉన్నప్పటికీ పూర్తి స్థాయి హెచ్ఐవి-ఏయిడ్స్ టీకా మాత్రం నేటికీ అందుబాటులోకి రాలేదు.**

**ప్రపంచ ఏయిడ్స్ టీకా దినం:**

హెచ్ఐవి-ఏయిడ్స్ టీకా ప్రాధాన్యాన్ని గుర్తించిన నాటి అమెరికన్ అధ్యక్షుడు బిల్ క్లింటన్ చొరవతో 1998 నుంచి ప్రతి ఏట 18 మే రోజున "ప్రపంచ ఏయిడ్స్ టీకా దినం" లేదా "ప్రపంచ హెచ్ఐవి టీకా అవగాహన దినం" పాటించుట ఆనవాయితీగా మారింది. 18 మే ఒక ప్రపంచ ఏయిడ్స్ టీకా దినమా కాదు, హెచ్ఐవి-ఏయిడ్స్ టీకా రూపొందించడానికి మరోసారి పునరంకితం కావలసిన సందర్భమనివతెలుసుకోవాలి. హెచ్ఐవి-ఏయిడ్స్ టీకా సుసాధ్యం కావడానికి పరిశోధకులు, వైద్య వృత్తి నిపుణులు, క్లినికల్ రడపరీక్షల విభాగాలు, పౌర సమాజం సమైక్యంగా నిలువవలసిన అవసరాన్ని గుర్తు చేస్తున్న ప్రపంచ ఏయిడ్స్ టీకా దినం మన సహకారాన్ని కోరుతున్నది. ప్రపంచ ఏయిడ్స్ టీకా దినోత్సవం ఇతివృత్తంగా "పునరాలోచన, పునర్ నిర్మాణం, అభివృద్ధి" అనబడే అంశాన్ని తీసుకొని ఏయిడ్స్ కట్టడికి పౌర సమాజ అవగాహన పెంచుతూ, దాని అంతానికి తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం జరగాలి.

**హెచ్ఐవి-ఏయిడ్స్ టీకా రూపొందించే ప్రయత్నాలు**

**ప్రధాన సవాళ్లు:**

నేటికీ హెచ్ఐవి-ఏయిడ్స్ రోగంతో పాటు క్యాన్సర్, డెమెన్సియా, పార్కిన్‌సన్, అస్తమా లాంటి పలు వ్యాధులకు నిర్దిష్టమైన చికిత్సలు కాని, టీకాలు కాని అందుబాటులో లేవు, ఉపశమన దక్షత మాత్రమే కలిగించే చికిత్సలు ఉన్నాయి. హెచ్ఐవి-ఏయిడ్స్‌కు టీకాను రూపొందించడానికి ప్రధాన అడ్డుగా నిలుస్తున్నది హెచ్ఐవి వైరస్ త్వరగా మ్యుటేషన్ కావడమనే లక్షణమే అని గమనించాలి. అయినప్పటికీ ఎంఆర్ఎన్ఎ, బిఎన్ఎబిఎస్, మొసాయిక్, విఆర్‌సి01, ఎఎంపి ట్రయల్స్ లాంటి పద్ధతుల ద్వారా హెచ్ఐవి-ఏయిడ్స్ ఆరోగ్య సమస్యకు టీకాలను రూపొందించా ప్రయత్నాలు వేగంగా జరుగుతున్నాయి. హెచ్ఐవి-ఏయిడ్స్ టీకా రూపొందించడంలో ప్రతిబంధకాలు నిధుల కొరత, అపోహలు, సమాచార కొరత లాంటివి నిలుస్తున్నాయి. శాస్త్రజ్ఞుల సమాజం పట్టుదలతో టీకా పరిశోధనలు కొనసాగుతున్న







ప్పటికీ పౌర సమాజ సంఘీభావం, వ్యాప్తిని అడ్డుకోవడం, అందుబాటులో ఉన్న చికిత్సలను విధిగా తీసుకోవడం, టీకా రూపొందించడానికి అవసర పాలసీలను తీసుకురావడం, హెచ్ఐవి-ఏయిడ్స్ పట్ల నెలకొన్న అపోహలను రూపు మాపడం, రోగులకు భరోసా కల్పించడం, హెచ్ఐవి-ఏయిడ్స్ పరీక్షలు చేయించుకోవడం, టీకా రూపకర్తల కృషిని గుర్తించడం నిరంతరం కొనసాగాలి.
హెచ్ఐవి-ఏయిడ్స్‌కు సరైన నిర్దిష్టమైన చికిత్సలు లేదా టీకాలు లేకపోయినప్పటికీ ఉపశమన లేదా నియంత్రణకు వైద్యం ఇవ్వడం జరుగుతోంది. నేడు శాస్త్రజ్ఞులు, వైద్య నిపుణులు, క్లనికల్ పరీక్షల విభాగాలకు సవాళుగా నిలుస్తున్న హెచ్ఐవి-ఏయిడ్స్ టీకా కలలు త్వరలోనే సుసాధ్యం కావాలని, హెచ్ఐవి-ఏయిడ్స్ మరణాలు లేని ప్రపంచం రావాలని కోరుకుందాం, మన వంతు కర్తవ్యాలను నిర్వహిద్దాం. హెచ్ఐవిని అడ్డుకొని, ఏయిడ్స్‌కు చరమగీతం పాడే రోజు రావాలని ఆశిద్దాం.

**డా: బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**

# డిగ్రీలు ఫుల్.. నైపుణ్యాలు నిల్

దేశవ్యాప్తంగా మరియు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఏటా కొన్ని లక్షల మంది గొప్ప విద్యార్హతలతో కూడిన డిగ్రీలతో సమాజంలోకి వస్తున్నారు.వీటి కోసం ఎంతో విలువైన వయసును అర్పించడమే కాకుండా తల్లిదండ్రులు తమ సంపదను దారపోస్తున్నారు. గొప్ప పేరు మోసిన పాఠశాలలో,కళాశాలలోయూనివర్సిటీలలో చదువుకోవడానికి పోటీ పడటం కూడా ఇందులో భాగమే. విద్యను అభ్యసిస్తున్న సంస్థ ప్రవేట్ అయినా ప్రభుత్వరంగానికి చెందినదైనా అందులో విద్యావసరుకు సంబంధించిన వసతులు మరియు నైపుణ్యాల పురోగతికి వీలైన విధానాల రూపకల్పన జరుగుతుందా అనేది నేడు ప్రశ్నార్థకంగా మారింది.పేరుకు మాత్రం డిగ్రీలు సాధించిన దాని పాలిట నైపుణ్యం మాత్రం చాలా వరకు శూన్యంగా మారడం బాధాకరమైన విషయం. సాధించిన డిగ్రీ సత్తా లేనిదిగా తయారవడం నేటి పోటీ ప్రపంచంలో ప్రధాన సమస్యగా తాండవిస్తుంది. దీనికి కారణాలు అన్వేషించడం నేటి తరానికి చాలా అవసరం. పాఠశాల విద్య నుండే నైపుణ్యాల నేర్పు పునాదికి బీజం పడాలి. ఉన్నత విద్య అభ్యసించే స్థాయికి చేరే సారికి ఒక నిష్ణత్తుడైన నైపుణ్యం కలిగిన వ్యక్తులుగా రూపుదిద్దుకొని పోటీ ప్రపంచంలో అడుగడితే జీవితం ఆనందమయం అవడం ఖాయం. ఏటా లక్షల మంది విద్యార్థులు డిగ్రీలు పూర్తి చేసుకుని కాలేజీల నుండి బయటకు వస్తున్నారు వారిలో ఎంతోమందికి ఉద్యోగాలు లభిస్తున్నాయి? ఎంత మందికి ఉద్యోగం వచ్చేటంత నైపుణ్యాలు ఉన్నాయి? దేశంలోని పట్టభద్రుల్లో సగం మందికి కూడా ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలు లేవని ఇండియా స్కిల్స్ రిపోర్ట్స్ చెప్తున్నాయి. ఏటేటా నైపుణ్యాలు పెరుగుతున్నాయి. వాటిని అందిపుచ్చుకునేలా విద్యార్థుల లోకం సన్నద్ధం




అయి ముందుకు వెళ్తుందా, లేదా అనేది ఆలోచించాల్సిన అవసరం ఉంది. విద్యార్థులు చదువుకుంటున్న పాఠశాలల్లో, కళాశాలలో, యూనివర్సిటీల్లో పూర్తిస్థాయిలో నైపుణ్యాలను అందించే ప్రయోగశాలలు, లైబ్రరీలు, విద్యా ప్రణాళికలు అందుబాటులో ఉన్నాయా అనేది గమనించాలి.కాసుల పంట ధ్యేయంగా సాగుతున్న విద్యాసంస్థలు విద్యార్థులను మార్కులమర యంత్రాలుగా మాత్రమే తయారుచేసి వారి ధనార్జన దాహాన్ని తీర్చుకుంటున్నాయి. జ వినూత్నమైన నైపుణ్యాలు అందించడంలో విఫలమవుతున్నాయి. ఉద్యోగ అర్హతలు ఉన్న వారి శాతం ప్రతి ఏడాదికి పెరుగుతూ వస్తుంది కానీ నైపుణ్యాలను అందించడంలో మాత్రం వెనకంజలో ఉంది.కొన్ని నివేదికల ప్రకారం అన్ని డిగ్రీ కోర్సులకు వాళ్ల కంటే బీటెక్ పూర్తి చేసుకున్న వారే ఎక్కువ ఉద్యోగాలు సంపాదిస్తున్నారు. 55.15% మందిలో జాబ్ చేసేందుకు కావలసిన నైపుణ్యాలు ఉన్నాయి. ఆ తర్వాత స్థానంలో ఎంబీఏ, బిఫార్మసీ విద్యార్థులు ఉన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులు చివరి స్థానంలో ఉన్నారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యావసరు పై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలి. పాఠశాలల్లో, కళాశాలలో, యూనివర్సిటీలో విద్యావిధానలపై సమీక్షలు నిర్వహించి అధునాతనమైన ప్రణాళికలు రూపొందించాలి. డిగ్రీలతో పాటు నైపుణ్యాలను పట్టభద్ర జీవితంలో ఒక భాగంగా మారేలా కృషి చేయాలి.

**వంశీకృష్ణగౌడ్ బండి**
**రంగయ్యపల్లి, రేగొండ**
**జయశంకర్ భూపాలపల్లి జిల్లా**
**8688063096**



## తెల్ల వస్త్రం

**ఒక రాయి గుడిలోకి శిల్పంలా వెళ్లి..**
**దేవుడై పూజలందుకుంటోంది**
**నిత్యం గుడికి వెళ్లి పూజలు చేసే**
**మనిషి..**
**బండరాయిలా మారి బయట**
**తిరుగుతున్నాడు !**

**అందాన్ని వదిలి అమ్మ..**
**బిడ్డకు జన్మనిచ్చి సపర్యలు చేస్తుంది**
**అందమైన భార్య కోసం అమ్మను**
**వదిలి..**
**ఆలికి సపర్యలు చేస్తాడు మగాడు !**

**అత్తారింట్లో అల్లుడు..**
**ఒక్క మాట పడినా భగ్గుమంటాడు**
**అత్తారింటికి చేరిన కోడలు..**
**నిత్యం మాటలు తలవంచి**
**పడుతోంది !**

**ఈ రోజు నన్ను కాపాడుకుంటే..**
**రేపు నిన్ను కాపాడతానంటుంది డబ్బు**
**ఈ రోజు నన్ను తెలివిగా**
**వాడుకుంటే..**
**రేపు నిన్ను ఉన్నతికి తెస్తానంటోంది**
**టైమ్ !**

**తాగుబోతు మద్యం మాత్రమే**
**తాగడు..**
**కుటుంబ ఆరోగ్యం, గౌరవం..**
**మర్యాద, అభిమానం అన్నీ..**
**అంగట్లో అమ్మేసి తూగుతుంటాడు !**

**రంగుల బట్టల జేబులు..**
**నింపుకోవడానికి పోరాటం చేస్తాం**
**చివరకు జేబుల్లేని తెల్ల వస్త్రాన్ని..**
**తయారు చేసినోడు అమ్మేస్తాడు..**
**కొన్న వాడు అసలే ధరించడు...**
**ధరించిన శవానికి తెలిసే వీలులేదు..**
**ఇదే కదా మూన్నాళ్ల ముచ్చటైన**
**జీవనం !**

**మధుపాళీ 9949700037**

# నేడు ఉచిత కంటి వైద్య శిబిరం


**ఆమనగల్లు, మే 17(నినాదం):** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు వారి ఆధ్వర్యంలో నేడు ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న రాంరెడ్డి లయన్ ఐ హాస్పిటల్ విజన్ సెంటర్లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ పి ఆర్ ఓ ఎం ఏ పాష తెలిపారు. ఆమనగల్లు మండల పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిఆర్ఓ పాషా తెలిపారు. కంటిచూపు మందగించిన వారు తమ గుర్తింపు కార్డులైన ఆధార్ కార్డు,రేషన్ కార్డు, ఫోన్ నెంబర్ తమ వెంట తెచ్చుకోవాలని ఆయన కోరారు.

# పేరుకే చెక్ పోస్టులా?



**వెల్దుర్తి, మే17 (నినాదం):** మాసాయిపేట మండలం రామంతాపూర్ లో శనివారం సుమారు 30 పశువులను భజరంగ్ దళ్ కార్యకర్తలు, రక్షక్ సేన దళం, పట్టుకుని పోలీసులకు అప్పగించిన విషయం తెలిసిందే. అయితే చెక్ పోస్టులు ఏర్పాటు చేసినప్పటికీ, తనిఖీలు సరిగా, చేయకపోవడం వల్లనే పశువుల అక్రమ రవాణా జరుగుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చెక్ పోస్టులు ఉన్నా గోవుల తరలింపు ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. అదేవిధంగా రాష్ట్రస్థాయిలో , జిల్లాస్థాయిలో, పోలీస్ అధికారులు, మంచిగా పని చేస్తుందని అన్నారు, కానీ కింది స్థాయి అధికారులు నామమాత్రానికే చేస్తున్నట్లు ఎన్ని రాష్ట్రాలు దాటుకుంటూ వచ్చి మన పట్టణంలో దొరకడం ఎంతవరకు సమంజసం, ఎందుకు ఇదే నిదర్శనం, అని పై అధికారులను వేడుకుంటున్నారు. కిందిస్థాయి పోలీస్ అధికారులు శ్రద్ధ వహించి చేస్తే ఇలాంటి అక్రమాలు జరిగాయి అని పై అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారం పై రాష్ట్ర డీజీపీ, జిల్లా ఎస్పీ, ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

# మిషన్ భగీరథ నీరు లీకేజీ



**వెల్దుర్తి, మే17 (నినాదం):** మాసాయిపేట మండల కేంద్రంలోని రైల్వే బ్రిడ్జి అండర్ పాస్ వద్ద మిషన్ భగీరథ నీరు లీకేజీ కారణంగా వృధాగా పోతోంది. గత వారం రోజుల క్రితమే మిషన్ భగీరథ పైప్ లైన్ అగ్నికి ఆహుతై వాటర్ లీకేజీ అవగా, తాజాగా మాసాయిపేట రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి గోడకు వేసిన ఎయిర్ పైప్ నుండి సుమారు రెండు ఇంచుల వరకు నీరు ధారలా కారుతూ వృధాగా పోతోంది. మిషన్ భగీరథ అధికారులు వెంటనే స్పందించి కాంట్రాక్టర్ ఎన్నోసార్లు విన్నవించిన నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు తెలుపుతున్నారు. అనంతరం లీకేజీని, అధికారులు, అరికట్టాలని స్థానికులు, విజ్ఞప్తి చేస్తున్నారు.

# కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాలకు ఎల్లప్పుడూ సహకారం అందిస్తా..

**బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**



**కుత్బుల్లాపూర్, మే 17 (నినాదం):** కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద 125 - గాజుల రామారం డివిజన్ శ్రీవెన్ ఎంక్లేవ్ నూతన సంక్షేమ సంఘం సభ్యులు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చెరుకుపల్లి కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం, కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని, శ్రీవెన్ ఎంక్లేవ్‌లో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాలకు ఎల్లప్పు డు సహకారం అందిస్తానని తెలిపారు. గత పన్నెండేళ్ల కాలంలో కుత్బుల్లాపూర్ లోని అన్ని ప్రాంతాలలోని కాలనీలను అభివృద్ధి పరిచామని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతన కాలనీలో మౌళిక వసతులను కల్పించేందుకు కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీవెన్ ఎంక్లేవ్ నూతన అధ్యక్షులు బి.శ్రీధర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పి.సోమరాజు, కోశాధికారి ఎన్.శ్రీనివాస్ రెడ్డి, సలహా దారులు ఎల్లారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షులు వాసు, గంగాధర్ రెడ్డి, శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి వెంకట్ రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి వై. వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

# సింఫనీ పార్క్ హోమ్స్ స్థలాలను పరిరక్షిస్తాం..

**పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి**

**కాలనీవాసులతో సమావేశం..**

**అధైర్యపడవద్దని భరోసా**





**పటాన్చెరు మే17(నినాదం):** పటాన్చెరు డివిజన్ పరిధిలోని సింపని పార్క్ హోమ్స్ లో గల కాలనీ స్థలాలను ఆక్రమణలకు గురి కాకుండా పరిరక్షిస్తామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి కాలనీవాసులకు భరోసా అందించారు. గజం స్థలం సైతం కబ్జా కానివ్వమని తెలిపారు.కాలనీ ఏర్పాటు చేసిన సమయంలో కాలనీ అవసరాల కోసం ఆరు వేల గజాల స్థలాన్ని సంబంధిత బిల్డర్ కేటాయించడం జరిగిందని.. తదనంతరం బిల్డర్ స్వార్థంతో కొందరు వ్యక్తులకు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని.. ఈ అంశంపై హైకోర్టులో స్టే ఉన్నప్పటికీ..ఇటీవల కొందరు ఆ భూమి తమకు రిజిస్ట్రేషన్ చేశారంటూ కబ్జా చేసేందుకు ప్రయత్నించడం జరుగుతోందంటూ కాలనీవాసులు ఎమ్మెల్యే జిఎంఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై చర్చించేందుకు ఆదివారం ఉదయం సింఫనీ పార్క్ హోమ్స్ కమ్యూనిటీ లో నివసిస్తున్న గృహ యజమానులతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనలకు అనుగుణంగా కాలనీ అవసరాల కోసం కేటాయించిన స్థలాన్ని బిల్డర్ కక్కుర్తి తో ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయడం చట్టపరంగా నేరమని తెలిపారు. చట్టం ప్రకారం ఈ స్థలం కాలనీకి చెందుతుందని తెలిపారు. ఈ అంశంలో ఎవరైనా తమ స్థలం అంటూ బలప్రయోగానికి దిగితే క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కాలనీ వాసులు ధైర్యంగా ఉండాలని.. ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు.. ఆంజనేయ స్వామి దేవాలయాన్ని పునర్నిర్మించడంతోపాటు రామాలయం, శివాలయం, అమ్మవారి దేవాలయాలను సైతం సొంత నిధులతో నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే జిఎంఆర్ కు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం. 2016లో కాలనీ ఏర్పాటైన నుండి నేటి వరకు అన్ని అంశాల్లో అండగా ఉంటూ తమ కాలనీకి కుటుంబ పెద్దగా వ్యవహరిస్తున్న పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి ఎల్లప్పుడు రుణపడి ఉంటామని దిశా కమిటీ సభ్యులు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు కాసాల సుధాకర్ అన్నారు. కాలనీ అభివృద్ధిలో ఎమ్మెల్యే జిఎంఆర్ పాత్ర మరువలేనిదని అన్నారు. తాము ఎల్లప్పుడూ ఆయనకు అండగా ఉంటామని తెలిపారు. కాలనీలో మౌలిక వసతుల కోసం కేటాయించిన స్థలం అంశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ సహకారానికి కాలనీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, జిహెచ్ఎంసి ఈఈ సురేష్ సిఐ వినాయక్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీధర్ చారి, హమీద్, డిఈ కృష్ణవేణి, కాలనీ అధ్యక్షులు సత్తిరాజు, సత్య రావు, లింగరాజు, విజయ్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడ్డ కాంగ్రెస్ కార్యకర్తలు అందరికీ సముచిత స్థానం

**సూదిని అభినందన సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం**

**పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా నియమించడం అభినందనీయం**

**టిపిసిసి సభ్యులు ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్**



**అమనగల్లు, మే 17(నినాదం):** తెలంగాణ పంచాయితీ ట్రిబ్యునల్ చైర్మన్ గా ఇటీవల నియమితులైన సూదిని రాంరెడ్డిని అభినందన సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిపిసిసి సభ్యులు ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆమనగల్లు పట్టణంలోని కళ్యాణి గార్డెన్ లో కల్వకుర్తి నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్ యుఐ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సూదిని రాంరెడ్డి అభినందన సన్మాన కార్యక్రమం గురించి సమావేశంలో చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ. ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కష్టపడ్డ కాంగ్రెస్ కార్యకర్తలు అందరికీ సముచిత స్థానం కల్పిస్తున్నట్లు తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని మాడ్గుల మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీపీ సూదిని రాంరెడ్డికి పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ చైర్మన్ గా నియమించడం అభినందనీయమని అన్నారు. చైర్మన్ పదవితో కల్వకుర్తి నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని శ్రీనివాస్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. సూదిని రాంరెడ్డి అభినందన సన్మాన కార్యక్రమం ఈనెల 20వ తేదీన బుధవారం ఆమనగల్లు పట్టణంలోని శ్రీ లక్ష్మీ గార్డెన్ లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గంలోని ఏడు మండలాలు, రెండు మున్సిపాలిటీల పరిధిలోని ప్రజలు, కార్యకర్తలు, వివిధ పార్టీల నేతలు రాజకీయాల కతీతంగా హాజరై సన్మాన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్, మాడుగుల, ఆమనగల్లు, కడ్తాల్ మండలాల అధ్యక్షులు భట్టు కిషన్ రెడ్డి, తెల్గమల్ల జగన్, బీచ్య నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అంజయ్యా గుప్తా, వస్పుల శ్రీశైలం, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్, సర్పంచ్ నరేందర్ రెడ్డి, నాయకులు సుద్ధపల్లి వెంకటేష్, పర్వతాలు, సూదిని శ్రీనివాస్ రెడ్డి, సూదిని కొండల్ రెడ్డి, కృష్ణ నాయక్, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, హీరా సింగ్, జవహర్ లాల్, కాలే మల్లయ్య, అవ్వారి శివలింగం, ఎంగలి ప్రసాద్, కొండల్ రెడ్డి, అన్మాస్ పల్లి శంకర్, ఖాదర్ ఖాద్రి, శ్రీధర్ రెడ్డి, పూసల సత్యం, గోల్డ్ రాము, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, రాజేందర్, దేవరశెట్టి మహేష్, శేఖర్ గౌడ్, కుమార్ గౌడ్, శివ, రాజు, తులసీ రామ్, రహీం తదితరులు పాల్గొన్నారు.

# మురుగునీటి కాలువ దుర్వాసన సమస్యకు శాశ్వత పరిష్కారం

**త్వరలో 10 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి**



**పటాన్చెరు మే17(నినాదం):** బీరంగూడ డివిజన్ పరిధిలోని జయలక్ష్మి నగర్, లక్ష్మి సాయి మెడోస్ కాలనీల మీదుగా వెళ్తున్న ప్రధాన మురుగు నీటి కాలువలో గల బండతో మురుగునీరు ఒకే చోట నిల్వ ఉండడం మూలంగా వెలువడుతున్న దుర్వాసన సమస్యను వారం రోజుల్లో పరిష్కరిస్తామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఆదివారం ఉదయం అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్ తో కలిసి కాలువను పరిశీలించారు. అనంతరం కాలనీవాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే జిఎంఆర్ స్వయంగా తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వారం రోజుల్లో బండను పూర్తిగా తొలగించి కాలువను శు భ్రపరచాలని జిహెచ్ఎంసి ఇరిగేషన్ ఎఇ గులాం ను ఆదేశించారు. కాలువ దుర్వాసన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపెడుతున్నామని తెలిపారు. బీరంగూడ డివిజన్ పరిధిలోని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక బద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. కాలనీలలో సీసీ రోడ్లు, యుజిడిల నిర్మాణం కోసం 10 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయని.. ఈ నెల 23న శంకుస్థాపన చేయ బోతున్నట్లు తెలిపారు. తాము ఎదుర్కొంటున్న సమస్యను విన్నవించిన వెంటనే స్పందించి.. పరిష్కారం దిశగా కృషి చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఈఈ సురేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.



# రాష్ట్ర ఏర్పాటులో ఉద్యమకారుల పాత్ర ఎంతో కీలకమైనది

**• ఉద్యమకారులు గుండా నిరంజన్**



**మల్కాజిగిరి, మే 17( నినాదం):** తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి ఆదేశాల మేరకు ఆనంద్ బాగ్ లోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఉద్యమకారులు గుండా నిరంజన్ ఆధ్వర్యంలో పాలాబి షేకాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఉద్యమకారుల పాత్ర కీలకమైనదని అన్నారు. ఉద్యమకారులను గుర్తించేందుకు తెలంగాణ రాష్ట్ర జీవో నెంబర్ 679 ప్రభుత్వ సలహాదారు కేకే కమిటీని ఏర్పాటు చేయడం హర్షించ దగ్గ విషయమన్నారు. మల్కాజిగిరి లో ఉద్యమ కారులను మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు గతంలోనే గుర్తించి వారికి చేదోడు, వాదోడుగా ఉంటూ వారి అవసరాలకు ఆదుకుంటూ ఉద్యమ కారులకు ఏ ఆపదలో ఉన్న ఆదుకునే నాయ కునిగా ముందున్నారన్నారు. ఈ కార్యక్ర మంలో సిరిగిరి నర్సింగ రావు, సంతోష్ రాందాస్, నయీంఖాన్, మోతే సాయి కుమార్, పార్థసారథి, ములుగు శ్రీనివాస్, కుమార్, రాగం రాజు, గడ్డం నరేష్, అరుణ్ కుమార్, కార్తీక్, గఫూర్, రాజు, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన ఇంధన ధరలతో సామాన్యుల బ్రతుకులు భారం

**కేంద్రం అధికధరలను నియంత్రించి పన్నుల భారం తగ్గించాలి**

**సిపిఎం కీసర సర్కిల్ నాయకులు బంగారు నర్సింగరావు**



**జవహర్ నగర్, మే 17 (నినాదం):** కేంద్ర ప్రభుత్వం పెంచిన ఇంధన ధరలను తగ్గించి సామాన్యుల జీవన విధానాన్ని, పెంచిన ధరలను నియంత్రించి పన్నుల భారం తగ్గించాలని సిపిఎం కీసర సర్కిల్ నాయకులు బంగారు నర్సింగ్ రావు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని కోరుతూ సిపిఎం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ బాలాజీ నగర్ చౌరస్తా లోని అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఎం కీసర సర్కిల్ నాయకులు బంగారు నర్సింగరావు హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల నడ్డి వీరిచే విధంగా పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను అమాంతం పెంచడం దుర్మార్గమన్నారు. పెట్రోల్ డీజిల్ రేట్లు పెరగడం వలన రవాణా చార్జీలు పెరిగి నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటే ప్రమాదం ఉందన్నారు. రోజు వారు ఖర్చులు పెరిగి సామాన్య ప్రజల బతుకు బారంగా మారి అర్ధాకలితో అలమటించే రోజులు పునరావృతం అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఏఐఎఫ్ టు యు రాష్ట్ర అధ్యక్షులు వై. మల్లేష్ మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో బతుకుతున్న ప్రజలపై ఇంధన భారం మోపే ప్రభుత్వాలను గద్దె దింపితే తప్ప ప్రజల బతుకులు మారవన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్ళు తెరిచి ఇందన ధరలను నియంత్రించి ప్రజలపై భారాన్ని తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జవహర్ నగర్ డివిజన్ నాయకులు శివన్నారాయణ, చింతకింది అశోక్, కార్మిక సంఘాల నాయకులు డి. నగేష్, చంద్రశేఖర్, కుమార్, నాగరాజు, సూరి, సాయి ,రాజు, అంజనేయులు, లక్ష్మణ్, బాలరాజు, నరసింహ ,లింగమ్మ, పద్మ, స్వామి, రాములు, రంజాన్, షబ్బీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# మద్యం తాగి వాహనం నడిపితే ఆరు నెలలు జైలుకే..

**జవహర్ నగర్ ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శివశంకర్**



**జవహర్ నగర్, మే 17 (నినాదం):** మద్యం తాగి.. వాహనం నడుపుతూ పట్టుబడితే ఆరు నెలల జైలు శిక్ష పదివేల జరిమానా తప్పదని జవహర్ నగర్ ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శివశంకర్ హెచ్చరించారు. జవహర్ నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధి దమ్మాయిగూడలో ట్రాఫిక్ డిసిపి రాహుల్ రెడ్డి ఆదేశాల మేరకు ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శివశంకర్ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాన్ని నడపవద్దని ఆరోగ్యం.. ప్రాణం... రెండు మీ చేతుల్లోనే ఉన్నాయని విలువైన జీవితాన్ని నాశనం చేసుకొని కుటుంబ సభ్యులకు తీరని శోకాన్ని మిగిల్చవద్దని అన్నారు. సమాజంలో 70% మరణాలు రోడ్డు ప్రమాదాల కారణంగానే జరుగుతున్నాయని మద్యం మత్తులో నడిపే వారే అత్యధికంగా చనిపోతున్నారని తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపి ఇతర వ్యక్తుల మరణానికి కారణమైతే వారే శిక్షార్హులు అవుతారని పేర్కొన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 54 మంది డ్రైవర్లు పట్టు పడ్డారని తెలిపారు. మద్యం మత్తులో వాహనాన్ని ఎట్టి పరిస్థితుల్లో నడపవద్దని మీ విలువైన జీవితాన్ని మీ కుటుంబ సభ్యులకు మీరు చాలా ముఖ్యమని భావించి సమాజంలో ఎంతోమంది మరణానికి కారణం అవుతూ వాళ్ళ కుటుంబాలకు రోడ్డున పడేయవద్దని ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసిపి రామలింగరాజు, మల్కాజ్గిరి ట్రాఫిక్ సిఐ నరసింహ, గోపాలపురం ట్రాఫిక్ సిఐ రవికుమార్, ఎస్సైలు, పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

# పశువులను సురక్షిత ప్రదేశాల్లో ఉంచాలి

**వికారాబాద్, మే 17(నినాదం):** రైతులకు సంబంధించిన పశువులను సురక్షిత స్థలాల్లో ఏర్పాటు చేసుకోవాలని నవాబుపేట ఎస్ ఐ గిరి తెలిపారు. పశువులను పొలాల వద్ద ఉంచడంతో అవి అపహరణకు గురైయ్యే అవకాశం ఉన్నదని అన్నారు. విధిలేని పరిస్థితుల్లో పొలాల వద్ద ఉంచాల్సి వస్తే వాటికి కాపల ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. వేసవికాలం కావడంతో పశువులు, మేకలు, గొర్రెలు అపహరణకు గురైయ్యే ప్రమాదం ఉన్న నేపథ్యంలో తగిన జాగ్రత లు తీసుకోవాలని అన్నారు.



# డిగ్రీ కళాశాలలో ఉత్తమ ప్రతిభా గుర్తింపు


**ఘనంగా ముగిసిన విద్యా వారోత్సవాలు**



**దుబ్బాక మే 17 (నినాదం):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న లి"ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక"లిలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, దుబ్బాకలో వారం రోజుల పాటు నిర్వహించిన విద్యా వారోత్సవాలు వారం రోజులు ఈరోజు ఘనంగా ముగిశాయి. ముగింపు సందర్భంగా నిర్వహించిన ఉత్తమ ప్రతిభా గుర్తింపు కార్యక్రమం మ ముగింపు సమావేశం కళాశాల ఆవరణలో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. భవాని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యా వారోత్సవాలు విద్యార్థులలో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, వ్యక్తిత్వ వికాసం వంటి విలువలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. గత ఏడు రోజులుగా నిర్వహించిన విద్యా, సాంస్కృతిక, అవగాహన, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలలో విద్యార్థులు ఎంతో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారని అభినందించారు. విద్య అనేది కేవలం పుస్తకాల జ్ఞానానికి మాత్రమే పరిమితం కాకుండా సమాజానికి ఉపయోగపడే విలువలను అలవరచుకోవడానికీ దోహదపడాలని తెలిపారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దుబ్బాక సర్కిల్ ఇన్స్పెక్టర్ టి. రాజేష్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, యువత క్రమశిక్షణ, నైతిక విలువలు, సమాజం పట్ల బాధ్యతతో ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకొని జీవితంలో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. సమాజ అభివృద్ధిలో విద్యార్థుల పాత్ర అత్యంత ముఖ్యమని, విద్యతో పాటు మానవీయ విలువలు కూడా అవసరమని పేర్కొన్నారు. వారం రోజులపాటు నిర్వహించిన విద్యా వారోత్సవాలలో వివిధ పోటీలు, అవగాహన కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ మరియు అధ్యాపక సిబ్బంది ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రత్యేక గుర్తింపులు కూడా అందజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. శ్యాం సుందర్ గారు మాట్లాడుతూ, విద్యా వారోత్సవాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు సమాజంపై అవగాహనను విస్తరింపజేశాయని తెలిపారు. కార్యక్రమాల విజయవంత నిర్వహణకు కృషి చేసిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని ప్రిన్సిపల్ మరియు వైస్ ప్రిన్సిపల్ ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. అదేవిధంగా కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ప్రిన్సిపల్ మరియు వైస్ ప్రిన్సిపల్‌లను ఘనంగా సన్మానించి తమ కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈరోజుతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, దుబ్బాకలో నిర్వహించిన విద్యా వారోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. ఈ వారోత్సవాలు విద్యార్థుల్లో కొత్త ఆలోచనలు, సామాజిక చైతన్యం, నాయకత్వ లక్షణాలు మరియు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాయని కళాశాల ప్రిన్సిపల్ అభిప్రాయపడ్డారు.

# విద్యతోనే మెరుగైన సమాజం, దేశప్రగతి

**• ప్రముఖ సంఘ సేవకులు శ్రీనివాస్**



**హైదరాబాద్ ప్రతినిధి, మే 17 (నినాదం):** విద్య ద్వారానే మెరుగైన సమాజం ఏర్పడుతుందని, దేశప్రగతి వేగవంతమవుతుందని ప్రముఖ సంఘ సేవకులు నక్కా శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ సిటీ కళాశాలలో ఏర్పాటుచేసిన విద్యావారోత్సవాల ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ.. పేద విద్యార్థుల చదువు కోసం ఎంతైనా ఖర్చు పెట్ట డానికి తాను సిద్ధమన్నారు. అనేక పాఠశాలలను దత్తత తీసుకొని తల్లిదండ్రుల పేరుమీద తాను అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. ఎంతో నిబద్ధతతో కృషి చేసి సిటీ కళాశాలకు భారతదేశంలోనే అత్యున్నత గ్రేడ్ తీసుకు రావటంలో అధ్యాపకులందరూ చేసిన కృషి అభినందనియమన్నారు. విద్యార్థులు ప్రమాద కరమైన వ్యసనాల బారిన పడకుండా అధ్యాప కులు, తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్.ప్రసాద్ మాట్లాడుతూ.. ఎంతో మంది దాతలు స్వచ్ఛంద సంస్థలు సిటీ కళాశాల అభివృద్ధికి తోడ్పడుతున్నారని కొనియాడారు. కళాశాలలో విద్యార్థులకు మంచినీటి వసతి కోసం, మౌలిక వసతుల సదుపాయాల ఏర్పాటుకోసం అనేక విధాలుగా ఆర్థిక సహాయం అందించిన నక్కా శ్రీనివాస యాదవ్, స్వర్ణ ప్రకాశ్, నూతన భవన కాంట్రాక్టర్ శ్రీనివాస్‌ని ప్రిన్సిపాల్, అధ్యాపక వర్గం సన్మానించారు. కాంట్రాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. స్వర్ణలత, కళాశాల నిధులతో ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, ఇంజినీరింగ్ శాఖ సహకారంతో చారిత్రక కట్టడంలో ఉన్న సిటీ కళాశాలకు అదే రూపురేఖలతో అత్యుత్తమ భవన నిర్మాణం చేసే అవకాశం తనకి రావటం తనకు చాలా సంతోషాన్నే కాక మంచి గుర్తింపును కూడా తెచ్చిందని అన్నారు. ఈ సందర్భంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచిన ఇలియాస్, మణికంఠ, గఫార్, విష్ణు, వంశీ, కళాశాల పూర్వ విద్యార్థిని ఎం.అపర్ణలను ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం సన్మానించారు. ఈ కార్యక్రమంలో పి.రతన్ కుమార్ డాక్టర్.కె.పర్వతాలు, డాక్టర్.ఎల్.తిరుపతి సన్మాన గ్రహీతలను, విద్యార్థులను అభినందిస్తూ మాట్లాడారు. కళాశాల ఐక్యూయేసి కో-ఆర్డినేటర్ ప్రొ.జె.నీరజ సమన్వయం చేసిన సభలో ప్రొఫెసర్.శాంతి, ప్రొఫెసర్.శంకర్ కుమార్, డాక్టర్.రాజేంద్ర కుమార్, ప్రొఫెసర్.కోయి కోటేశ్వర రావు, ప్రొఫెసర్.నైన వినోదిని, డాక్టర్.శ్రీదేవి, డాక్టర్.శ్రీనివాస్, డాక్టర్.శారద, డాక్టర్.శ్రీనివాస రెడ్డి, డాక్టర్.వాసుదేవ రెడ్డి, డాక్టర్.కృష్ణవేణి తదితర అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

## బొమ్మ శ్రీరామ్ చక్రవర్తికి ఘన స్వాగతానికి ఏర్పాట్లు



**కరీంనగర్, మే 17(నినాదం)**

తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి సోమవారం తొలిసారిగా కరీంనగర్ జిల్లాకు రానున్న సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ పిలుపు నిచ్చారు. నగరంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, బీసీ సంక్షేమం మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో పలు కుల సంఘాలకు కార్పొరేషన్ చైర్మన్ పదవులు కేటాయించడం అభినందనీయ మని పేర్కొన్నారు. జిల్లాకు చెందిన బొమ్మ శ్రీరామ్ చక్రవర్తికి ఈ బాధ్యతలు అప్పగించినందుకు ముఖ్యమంత్రి, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.సోమవారం ఉదయం 9 గంటలకు నగరంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద బొమ్మ శ్రీరామ్ చక్రవర్తికి స్వాగతం పలికి, అక్కడి నుంచి కమాన్, బస్టాండ్, ఇందిరా చౌక్ మార్గంగా ఇందిరా గార్డెన్స్ వరకు భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొననున్నట్లు వెల్లడించారు. అనంతరం ఇందిరా గార్డెన్స్‌లో ఆత్మీయ సన్మాన సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.



## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఏసిపి

**జమ్మికుంట, మే 17 (నినాదం)**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సలీం పాషా ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందగా ఆదివారం కాజీపేట ఏసీపీ పింగళి ప్రశాంత్ రెడ్డి పరామర్శించారు.ధర్మారం గ్రామానికి చెందిన సలీం పాషా గత కొద్ది రోజుల క్రితం హుజురాబాద్ మండలంలోని తోకలపల్లి గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కాజీపేట ఏసిపి పింగిలి ప్రశాంత్ రెడ్డి ఆదివారం సలిం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. స్థానికంగా ఉన్న వారిని సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరితో స్నేహపూ ర్వకంగా ఉండే వ్యక్తి సలీం రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తనను కలచివేసిందని ఆయన మృతి ఆ కుటుంబానికి తీరని లోటు అని అన్నారు. సలీం పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ దుబ్బ మల్లన్న దేవస్థానం చైర్మన్ ముద్దమల్ల రవి, ఫజల్ రహమాన్, పైడిపల్లి ఆంజనేయులు, నెల్లి అశోక్ ,సమీర్ ,ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.



## పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసిన మంత్రి అడ్లూరి

**బుగ్గారం,మే 17 (నినాదం)**

బుగ్గారం మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కుమార్ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేపట్టి భూమి పూజ చేశారు. చిన్నాపూర్ గ్రామంలో పాత గ్రామ పంచాయతీ భవనం శిథిల వ్యవస్థకు రావడంతో నూతన భవనం నిర్మాణం కొరకు భూమి పూజ చేశారు. అనంతరం బుగ్గారం మండల కేంద్రంలోని సాంబశివ నాగేశ్వర ఆలయం వద్ద నిర్మించే సుమారు 25 లక్షల రూపాయలతో ఫంక్షనల్ నిర్మాణం కొరకు శంకుస్థాపన చేసి భూమి పూజచేసారు. అనంతరం యశ్వంత్రావుపేట గ్రామంలో కెనాల్ కల్వర్టు నిర్మాణం,ప్రాథమిక పాఠశాల భవన కాంపౌండ్ నిర్మాణం కొరకు భూమి పూజ చేశారు. ఆయా సంబంధిత కాంట్రాక్టర్లను పిలిచి నాణ్యత మైన నిర్మాణం నిర్మిం చాలని సూచించారు.అనంతరం శేఖల్ల గ్రామంలోని పాఠశాల భవన కాంపౌండ్ నిర్మాణ కొరకు శంకుస్థాపన చేసి భూమి పూజ చేశారు.ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు గ్రంథాలయ చైర్మన్ దినేష్, మాజీ జెడ్పిటిసి బాదినేని రాజేందర్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నగునూరి నర్సా గౌడ్, పలు శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## మార్కెట్ యార్డు అభివృద్ధికి చర్యలు

- మౌలిక వసతుల విస్తరణతో ఆధునికీకరణకు ప్రణాళికలు
- మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న

**కరీంనగర్, మే 17(నినాదం )**

కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ యార్డును రైతులకు మరింత అనుకూలంగా తీర్చిదిద్దేందుకు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న తెలిపారు. మార్కెట్ యార్డులో మౌలిక వసతుల విస్తరణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ ప్రణాళికాబద్ధంగా పనులు కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.యార్డులో పలు ప్రాంతాల్లో విద్యుత్ దీపాల ఏర్పాటు పూర్తి చేసినట్లు తెలిపారు. అలాగే తాగునీరు, పారిశుధ్యం, షెడ్లు, రహదారుల అభివృద్ధికి చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఆదివారం మార్కెట్ యార్డును సందర్శించిన ఆకుల నరసన్న అక్కడి పరిస్థితులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. రైతులు మార్కెట్‌కు వచ్చినప్పటి నుంచి ధాన్యం విక్రయం పూర్తయ్యే వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. రైతులకు మెరుగైన సేవలు అందించే దిశగా మార్కెట్ కమిటీ నిరంతరం కృషి చేస్తోందని ఆయన స్పష్టం చేశారు.



## అర్బన్ చాలెంజ్ ఫండ్ అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

### విలీన గ్రామాలు, నగరాభివృద్ధి ప్రాజెక్టులపై సమగ్ర సమీక్ష

**కరీంనగర్, మే 17(నినాదం )**

కరీంనగర్ నగర సమగ్రాభివృద్ధిలో భాగంగా ఆదివారం అర్బన్ చాలెంజ్ ఫండ్ పథకం కేంద్ర అధికారి నగరంలో పర్యటించి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి రేకుర్తి, తీగలగుట్టపల్లి, ఆరెపల్లి, సీతారాంపూర్ తదితర విలీన గ్రామాల డివిజన్లను సందర్శించారు. స్థానిక రహదారులు, అంతర్గత మురుగు కాలువలు, వరద నీటి పారుదల మార్గాలు, స్కైవాక్ నిర్మాణ ప్రతిపాదిత ప్రదేశాలను పరిశీలించి, వర్షాకాలంలో తలెత్తే వరద సమస్యలు, మురుగు నీటి పారుదల ఇబ్బందులపై అధికారులతో చర్చించారు. అనంతరం నగర డంపింగ్ యార్డును సందర్శించి పరిస్థితులను సమీక్షించారు. అర్బన్ చాలెంజ్ ఫండ్ పథకంలో భాగంగా ప్రతిపాదించిన నమూనా రహదారులు, జంక్షన్ల అభివృద్ధి, పాదచారుల భద్రత కోసం స్కైవాక్‌లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం, లోతట్టు ప్రాంతాల్లో వరద ముంపు నివారణకు డ్రైనేజీల పునరుద్ధరణ, కొత్త కాలువల నిర్మాణం వంటి ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ అధికారులు ప్రతిపాదిత ప్రాజెక్టులపై కేంద్ర బృందానికి సమగ్ర వివరాలు అందించారు. పర్యటనలో ఎస్‌ఈ రాజ్‌కుమార్, ఈఈ సంజీవ్‌కుమార్, డీఈ దేవేందర్, ఏఈ సతీష్ తదితర అధికారులు పాల్గొన్నారు.





## ఘనంగా విద్యా వారోత్సవాల ముగింపు వేడుకలు

**అభివృద్ధికి సహకరించిన దాతలకు ఘన సన్మానం**

**జమ్మికుంట, మే 17 (నినాదం)**

జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బీ.రమేష్ అధ్యక్షతన ఘనంగా విద్యా వారోత్సవాల ముగింపు వేడుకలు జరిగాయి. కళాశాలలో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11న ప్రారంభమైన విద్య వారోత్సవాల ముగింపు ను పురస్కరించుకొని ఆదివారం కళాశాలలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. కళాశాలలో గత రెండు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం, మినరల్ వాటర్ ప్లాంట్ దాతలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అలాగే ఇటీవల కేంద్రీయ విశ్వ విద్యాలయాలలో పీజీ కోర్సులకు అర్హత సాధించిన కళాశాల విద్యార్థులకు పుష్ప గుచ్చాలతో కళాశాల ప్రిన్సిపల్ , అధ్యాపకులు అభినందించారు.

**ఎల్ ఎస్ ఎస్ డి సి తో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఒప్పందం**

విద్యా వారోత్సవాలలో భాగంగా జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల హైదరాబాద్ లోని లైఫ్ సైన్సెస్ స్కిల్ డెవలప్మెంట్ కౌన్సిల్ తో అవగాహన ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పందంతో కళాశాలలోని విద్యార్థులకు ఉద్యోగ నియామకాలకు సంబంధించిన శిక్షణ ఇస్తారు. అనంతరం కంపెనీలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బీ.రమేష్ మాట్లాడుతూ ఎల్ ఎస్ ఎస్ డి సి తో ఒప్పందం జరగడం చాల గొప్ప విషయమన్నారు. దీని ద్వార జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివే విద్యార్థులకు భవిష్యత్తులో మంచి ఉద్యోగఅవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. ఈ ఒప్పందం కళాశాల విద్యార్థులకు ఓ వరం లాంటిదని అన్నారు. అనంతరం ఎల్ ఎస్ ఎస్ డి సి ప్రాజెక్టు తెలంగాణ రాష్ట కోఆర్డినేటర్ యు. కుమారస్వామిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దాతలు బచ్చు భాస్కర్ , డాక్టర్ ముక్క శరత్ కుమార్, డాక్టర్ ముక్క రాము, డాక్టర్ వొల్లాల శ్రీనివాస్ , వైస్-ప్రిన్సిపాల్ ఐతీ. ఎస్.ఓదెలు కుమార్, అకడమిక్ కో–ఆర్డినేటర్ డాక్టర్ కే. రాజేంద్రం, స్టాఫ్ సెక్రెటరి డాక్టర్ గణేష్ , దోస్త్ కో– ఆర్డినేటర్ కిరణ్ కుమార్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చెరువును మింగేస్తున్న దొంగలు

- ఇదేంటని స్థానికులు అడుగుతే బెదిరింపులు
- నిద్ర మత్తులో అధికారులు
- కబ్జా కోరల్లో కొత్త కుంట చెరువు



**బుగ్గారం,మే 17 (నినాదం)**

జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం గంగాపూర్ గ్రామంలో గల కొత్త కుంట చెరువును దొంగలు మింగేస్తున్నారు. చెరువులోని మట్టిని పూడిక తీస్తూ కట్టను చీల్చుతూ ప్రైవేటు భూముల్లో పోస్తున్న వైనం. వివరాల్లోకెళ్తే బుగ్గారం మండలం గంగాపూర్ గ్రామంలో కొత్త కుంట చెరువు సర్వే నంబర్ 164 /ఆ లోని 1:37 విస్తీర్ణంలో చెరువు గలదు ఇది గతంలో 2009 సంవత్సరం వరకు రెవెన్యూ రికార్డులలో ప్రభుత్వ భూమిగా ఉన్నది అని స్థానికులు తెలుపుతున్నారు. తదనంతరం అక్రమంగా కట్ట రాజయ్య తండ్రి చంద్రయ్య పేరు మీద రికార్డులో నమోదు చేసుకొని పట్టా ఉన్నది అనే సాకుతో చెరువులోని మట్టిని చెరువు కట్టను జెసిబి తో తవ్వకాలు చేపట్టి కొత్త కుంట హద్దు కట్టని దాదాపు సగం వరకు తొలగించారని స్థానికులు వాపోతున్నారు. నిండుకుండలాంటి చెరువును నాశనం చేస్తూ భూగర్భ జలాలు లేకుండా చేస్తున్నారని రానున్న రోజుల్లో చెరువు చుట్టుపక్కల భూములు వ్యవసాయానికి పనికి రాకుండా పోతాయని చుట్టుపక్కల రైతులు మొరపెట్టుకుంటున్నారు. మట్టి దొంగలు చెరువు కట్టను తవ్వడం ఆపాలని ఎవరైనా అడ్డుకుంటే వారిపై దాడులకు దిగడం, బెదిరించడం, జరుగుతుందని ప్రజల ఆరోపిస్తున్నారు. ఇంత తతంగం జరిగిన చెరువు కట్టని మింగేసిన దొంగలను అక్రమార్కులను రెవెన్యూ అధికారులు చూసి చూడనట్లు ఉండడం చూస్తే అధికారుల అండదండలతో ఈ తవ్వకాలు జరుగుతున్నాయేమో అని అనుమానం ప్రజల్లో కలుగుతుంది. గతంలో ఈ తవ్వకాలను ఆపాలని జర్నలిస్టులు వెళితే అక్రమార్కులు బెదిరింపులకు దిగారని స్థానిక రెవెన్యూ డిపార్ట్మెంట్ కి సమాచారం అందిస్తే అలాంటి తవ్వకాలు ఏం లేవండి అని మాట దాటవేశారని జర్నలిస్టులు కూడా తెలిపారు. ఈ తవ్వకాలు ఇలాగే జరుగుతే భవిష్యత్తు తరాలకు వ్యవసాయ రంగం,సాగురంగం,తాగునీటి సమస్య గంగాపూర్ గ్రామం చుట్టూ ఉన్న పలు గ్రామాలకు ఇబ్బందిగా మారుతుందని ప్రజలు వాపోతున్నారు. జిల్లా స్థాయి అధికారులు స్పందించి మట్టి దొంగలను కబ్జాకోరుల పై చర్యలు తీసుకొని తవ్వకాలను ఆపాలని కోరుతున్నారు

## ఈఏపీసెట్‌లో శ్రీ చైతన్య విద్యార్థుల ర్యాంకుల సునామీ

- రాష్ట్ర స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు యాజమాన్యం అభినందనలు
- కళాశాల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి

**కరీంనగర్, మే 17(నినాదం )**

ఆదివారం విడుదల చేసిన ఈఏపీసెట్ ఫలితాల లో శ్రీ చైతన్య జూనియర్ కాలేజీ విద్యార్థులు ఈఏపీసెట్ 2026 ఫలితాలలో విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. పి. స్ఫూర్తిశ్రీ 1338, ఇ. అఖిల 1390, యస్. భార్గవి 1512, షేక్ హుస్సేన్ జాఫర్ 2589, యస్. హారిక 2592, యస్. రవి 3323, మహేశ్వరి 3455, ఎ. సుహాస్యా రెడ్డి 3548, యం. సాయి సాత్విక్ 3806, బి. సాయి అఖిల్ 4325, బి. విఘ్నేష్ వర్ధన్ 4824, పి. హాసిని రావు 5600 ర్యాంకులు సాధించారు. అదనంగా పదివేల లోపు 30 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు పొందారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను అభినందించారు. ఈ విజయానికి కృషి చేసిన అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కర్ర నరేంద్ర రెడ్డి, డీన్ జగన్‌మోహన్ రెడ్డి, ప్రిన్సి పల్స్, ఏజీఎం శ్రీనివాస్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



## జవ్వాజి మల్లయ్యకు ఘన నివాళులర్పించిన పింగళి రమేష్

**జమ్మికుంట, మే 17 (నినాదం)**

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నియోజకవర్గం అధ్యక్షుడు జెకె తండ్రి జవ్వాజి మల్లయ్య ఇటీవల మృతి చెందగా ఆదివారం ఇల్లంతకుంట మండలంలోని సిరిసేడు గ్రామంలో నిర్వహించిన మల్లయ్య పెద్దకర్మ లో పాల్గొని ఘన నివాళులు అర్పించిన కేడీసీసీ బ్యాంక్ వైస్ చైర్మన్ పింగళి రమేష్. హుజురాబాద్ నియోజకవర్గం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నియోజకవర్గం కన్వీనర్ బిఆర్ఎస్ పార్టీ యూత్ నియోజకవర్గ ఇన్చార్జ్ జెకె తండ్రి జవ్వాజి మల్లయ్య పెద్దకర్మ ఆదివారం రోజున సిరిసేడు గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె డి సి సి బ్యాంక్ వైస్ చైర్మన్ పింగళి రమేష్ తో పాటు పలువురు ప్రముఖులు హాజరై జవ్వాజి మల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఎంతో చురుకుగా పాల్గొని ముదిరాజ్ కుల హక్కులకై ఎంతగానో కృషి చేసిన వ్యక్తి జవ్వాజి మల్లయ్య మన మధ్యలో లేకపోవడం చాలా బాధాకరమని అన్నారు మల్లయ్య ముదిరాజ్లకు అనేక సేవలు అందించిన మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ వైస్ చైర్మన్ పింగిలి రమేష్, ఇల్లంతకుంట పిఎసిఎస్ వైస్ చైర్మన్ కందాల కొమురెల్లి, మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు, ఉమ్మడి జమ్మికుంట మాజీ వైస్ ఎంపీపీ చుక్క రంజిత్, ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ మల్లిక్ ఎం వి కే తక్కల్లపల్లి సత్యనారాయణ, కోడం రాజు, పుట్టరాజు, శీలం రాజు, ప్రియాంక, స్వాతి రెడ్డి, దబ్బెట రాజు, జానీ, హై కోర్ట్ అడ్వకేట్ రాహుల్, విక్రమ్, రాకేష్, అఖిల్‌తోపాటు పాల్గొన్నారు

## బీపీ నియంత్రణతోనే ఆరోగ్య రక్షణ

**జీవనశైలి మార్పులు, క్రమం తప్పని పరీక్షలతో అధిక రక్తపోటుపై నియంత్రణ సాధ్యమని మెడికవర్ వైద్యుల సూచన**




**కరీంనగర్, మే 17(నినాదం)**

ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌లోని మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వెటర్నరీ కళాశాల మైదానంలో వాకర్ల కోసం ప్రత్యేక ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు అధిక రక్తపోటు (బీపీ) వల్ల కలిగే ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.జనరల్ వైద్యుడు డాక్టర్ నాగరాజు, మత్తు వైద్య నిపుణుడు డాక్టర్ వినయ్, అత్యవసర వైద్య నిపుణుడు డాక్టర్ ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ బీపీని “నిశ్శబ్ద హంతకుడు”గా అభివర్ణించారు. చాలా మందికి బీపీ ఉన్న విషయం తెలియకపోవడం వల్ల గుండె, మెదడు, మూత్రపిండాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు.క్రమం తప్పకుండా రక్తపోటు పరీక్షలు చేయించుకోవడం ద్వారా సమస్యను ముందుగానే గుర్తించి అదుపులో ఉంచుకోవచ్చన్నారు. ప్రతిరోజూ శారీరక శ్రమ, సరిపడ నిద్ర, ఇంటి ఆహారం తీసుకోవడం వంటి అలవాట్లు బీపీ నియంత్రణకు సహాయపడతాయని తెలిపారు. రోజుకు ఐదు గ్రాములకంటే ఎక్కువ ఉప్పు తీసుకోకూడదని సూచించారు.ప్రతి మూడు నుంచి నాలుగు నెలలకు ఒకసారి రక్తపోటు పరీక్ష చేయించుకోవాలని, 140 దాటితే తప్పనిసరిగా వైద్యుల సూచనలు పాటించాలని పేర్కొన్నారు. ఒత్తిడిని తగ్గించుకోవడం, ప్రకృతికి దగ్గరగా జీవించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవడం ద్వారా కూడా బీపీని నియంత్రించ వచ్చన్నారు. మూత్రపిండాల సమస్యలున్నవారిలో బీపీ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. అవసరమైతే మాత్రమే మందులు వాడాలని, ప్రతి ఒక్కరూ జీవితాంతం బీపీ మందులపై ఆధారపడాల్సిన అవసరం లేదని వివరించారు.మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన హెల్త్‌టాక్‌లో 21వ డివిజన్ కార్పొరేటర్ వరాల నర్సింగం, కాంగ్రెస్ పార్టీ టౌన్ జనరల్ సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి, వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నరేందర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి భూంరెడ్డి, కోశాధికారి రాంనాథం, మెడికవర్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, చంద్రశేఖర్, సంతోష్, మనోజ్, హరీష్, హెచ్‌ఆర్ మేనేజర్ ఈశ్వర్, నర్సింగ్ సూపరింటెండెంట్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి ప్రాజెక్టులపై మంత్రి దృష్టి

- కాగితాల ప్రాజెక్టులకు చెక్..
- ప్రచారానికి కాదు.. రైతు పొలాలకు నీళ్లు చేరాలి
- ఏడాదిలో సాగునీటి పనులు పూర్తి చేస్తాం..
- మంత్రి అడ్లూరి



**ధర్మపురి మే 17 ( నినాదం )**

ధర్మపురి నియోజకవర్గంలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. గత ప్రభుత్వ హయాంలో ప్రకటనలు, శంకుస్థాపనలకే పరిమితమైన పనులను వేగంగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఆదివారం ధర్మపురి మండలంలోని అక్కేపల్లి చెరువును ఇరిగేషన్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి పరిశీలించిన మంత్రి.. ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. చెరువు పరిసరాలను పరిశీలిస్తూ పనుల ఆలస్యంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధర్మపురి నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అక్కేపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుతో పాటు రోల్లవాగు ప్రాజెక్టు, వెల్గటూర్ ఎత్తిపోతల పథకం, పత్తిపాక రిజర్వాయర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులు సంవత్సరాలుగా పూర్తికాక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇకపై ఆ పరిస్థితి ఉండదని, ఏడాదిలోపు పెండింగ్ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అక్కేపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనుల్లో తీవ్ర జాప్యం జరిగినట్లు గుర్తించిన ప్రభుత్వం.. పనులు చేపట్టిన పాత ఏజెన్సీని తప్పించి కొత్త ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించినట్లు మంత్రి వెల్లడించారు. త్వరలోనే పనులు మళ్లీ ప్రారంభమవుతాయని, రైతుల సూచనలు, అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తైతే నియోజకవర్గంలోని సుమారు ఐదు వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు.

రోల్లవాగు ప్రాజెక్టుపై కూడా మంత్రి ఘాటుగా స్పందించారు. గతంలో సరైన అనుమతులు లేకుండానే పనులు ప్రారంభించడం వల్ల ప్రాజెక్టు ముందుకు సాగలేదన్నారు. అంచనాలు పెంచి పనులు చేపట్టినా రైతులకు ఆశించిన ప్రయోజనం అందలేదని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం అటవీ శాఖ సహా అవసరమైన అన్ని అనుమతులు సాధించే ప్రక్రియ కొనసాగుతోందని, వాటిని పూర్తి చేసి పనులు వేగవంతం చేస్తామని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల పూర్తి కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని స్థాయిల్లో సమన్వయం చేస్తోందని మంత్రి వివరించారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి ధర్మపురి ప్రాజెక్టుల పరిస్థితిని వివరించినట్లు చెప్పారు. నిధుల విడుదలలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తో కూడా ప్రత్యేకంగా చర్చించినట్లు వెల్లడించారు. “ప్రాజెక్టులు ప్రచారానికి కాదు.. రైతు పొలాలకు నీళ్లు చేరేందుకు ఉండాలి. పనులు పూర్తై రైతుకు ప్రయోజనం అందినప్పుడే వాటికి విలువ ఉంటుంది” అని మంత్రి వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా, వచ్చే గోదావరి పుష్కరాల ఏర్పాట్లపైనా ప్రభుత్వం దృష్టి సారించినట్లు మంత్రి తెలిపారు.

తొలి విడతగా రూ.118 కోట్లు విడుదలయ్యాయని, టెండర్ ప్రక్రియ త్వరలో పూర్తవుతుందని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి పుష్కరాల ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. మంత్రి పర్యటనతో ధర్మపురి ప్రాంత రైతుల్లో సాగునీటి ప్రాజెక్టులపై మరోసారి ఆశలు చిగురిస్తున్నాయి. ఏళ్లుగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టులు నిజంగా పూర్తి అయితే నియోజకవర్గ వ్యవసాయ రంగానికి కొత్త ఊపు వస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ , బాదినేని రాజేందర్, పలువురు రైతులు , మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

**వికారాబాద్, మే 17(నినాదం):** ఇళ్ళ స్థలాలు, అక్రెడిటేషన్, హెల్త్‌కార్డుల ప్రక్రియను వేగవంతం చేయాలని టీ డబ్ల్యూ జే ఎఫ్ వికారాబాద్ జిల్లా మహాసభలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య జర్నలిస్టుల సమస్యల పరిష్కారం లో మరింత వేగం పెంచాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం వికారాబాద్‌లో సమాజం కమిటీ సమావేశమైయింది. ఈ సందర్భంగా ఆయన ఏళ్ళ తరబడి సమస్యలు పెండింగ్ లో ఉండటం తో జర్నలిస్టులు ఇబ్బంది పడుతున్నారని గుర్తుచేశారు. గత రెండున్నర సంవత్సరాలుగా అక్రెడిటేషన్ లు లేక అష్టకష్టాలు పడ్డారని అభిప్రయపడ్డారు. ఎట్టకేలకు అక్రిడిటేషన్ లు, ఇండ్ల స్థలాల జారీ ప్రక్రియ ప్రారంభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఇందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియచేశారు. కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన 29 కార్మిక చట్టాల్లో రెండు వర్కింగ్ జర్నలిస్టుల చట్టాలు ఉన్నాయని గుర్తు చేశారు. ఇండ్ల స్థలాల జారీ ప్రక్రియ లో జర్నలిస్ట్ సంఘాల అభిప్రాయం తీసుకోకపోవడం పై నిరసన తెలిపారు. హైదరాబాద్ తో పాటు జిల్లా కేంద్రాలో మహిళా జర్నలిస్టుల సంఖ్య పెరుగుతోందనీ, వారికి ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పని చేసే చోట నుంచి ఇంటివరకు రాత్రి పూట రవాణా వసతిని ఏర్పాటు చేయాలనీ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ



ఉద్యోగులకు ప్రవేశపెడుతున్న నూతన హెల్త్ కార్డుల పథకాన్నీ జర్నలిస్తులకూ వర్తింప చేయాలని కోరారు. సంక్షేమ పథకాలను వీలైంత తొందరగా అమల్లోకి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉన్న జర్నలిస్టుల స్వేచ్ఛను కాపాడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఈ మహాసభకు సీనియర్ జర్నలిస్ట్ మహ్మద్ షఫీ అధ్యక్షత వహించగా భారీ సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు. ఈ మహాసభలో సీనియర్ జర్నలిస్టులు ఎం రవీందర్, సంజీవ, రాంచందర్, వెంకట్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలు తీర్మణాలు చేశారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాలు, అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డుల మంజూరు ప్రక్రియను వెంటనే వేగవంతం చేయాలి. మహిళా జర్నలిస్టులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలి. ఇండ్ల స్థలాల జారీ ప్రక్రియలో జర్నలిస్టు సంఘాల అభిప్రాయం తీసుకోవాలి. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలను మరింత చురుగ్గా అమలు చేయాలి. శిక్షణా కార్యక్రమాలను పెంచాలి. వికారాబాద్ లోని జర్నలిస్టులకు స్థానికంగా ఇండ్ల స్థలాలు ఇవ్వాలి. అదేవిధంగా వికారాబాద్ జిల్లా నూతనంగా టీ డబ్ల్యూ జే ఎఫ్ వికారాబాద్ జిల్లా నూతన కమిటీ 34 మంది జర్నలిస్తులతో ఎన్నికైంది. అధ్యక్షులు గా టి రాంచందర్, కార్యదర్శి గా ఎం డి షఫీ, ఉపాధ్యక్షులు గా ఆనంద్,మురళి గుప్తా, బి ఆర్ కె కృష్ణా, శ్రీను, పాండు, హాఫీజ్, బీమాషాప్ప, సహాయ కార్యదర్శులు గా మాణిక్యం, వెంకట్, బసవరాజ్, కృష్ణ, అనిల్, రాజు, అనిల్, కోశాధికారిగా ప్రశాంత్, క్రిడల కార్యదర్శిగా వెంకట్, కార్యవర్గ సభ్యులుగా రమేష్, చంద్రశేఖర్, ఎన్ కుమార్, అజీజ్ అలీ, ఉదయ్, మహేందర్, ఏజాజ్, జగన్, అరుణ్, స్టేట్ కౌన్సిల్ సభ్యులుగా ఎం రవీందర్, బి సంజీవ్, వెంకట్ రాం రెడ్డి, నేషనల్ కౌన్సిల్ సభ్యులుగా మాసాని వెంకటయ్య తదితరులు ఎన్నికయ్యారు. అనంతరం కొత్త కమిటీ కని సన్మానం చేశారు.

## పండ్ల వ్యాపారులకు స్టీల్ వాటర్ బాటిళ్ళ పంపిణీ



**వికారాబాద్, మే 17(నినాదం):** వికారాబాద్ జిల్లా నియోజకవర్గ కేంద్రంలో రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునే పండ్ల బండ్ల వర్తకులకు డాక్టర్ ఏ. చంద్రప్రియ స్టీల్ వాటర్ బాటిళ్లను ఆదివారం పంపిణీ చేశారు. ఎండాకాలంలో వడదెబ్బ బారిన పడకుండా, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రోజంతా ఎండలో ఉండి వ్యాపారం చేసే చిరు వ్యాపారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని స్టీల్ బాటిళ్లను అందించామని, ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ బాటిళ్లకు బదులుగా స్టీల్ బాటిళ్లను వాడాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. బాటిళ్లను అందుకున్న పండ్ల వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. వేసవిలో తమకు ఎంతో ఉపయోగపడతాయని సేవా భావానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చదువుతో పాటు నాయకత్వ లక్షణాలు అందించాలి





**సిద్దిపేట ప్రతినిధి మే 17(నినాదం):** విద్యార్థులకు చదువుతో పాటు ధైర్యంగా నిలబడడం, మానసిక శారీరక సామర్థ్యాలు పెంపొందించడం, నాయకత్వ లక్షణాలతో కూడిన మంచి విలువలను అందించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఉపాధ్యాయులకు సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రక్రియలో భాగంగా విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రక్రియలో భాగంగా ఇప్పటివరకు 10 థీమ్ ల తోటి వారానికి ఒక్కో ప్రత్యేకమైన థీమ్ తో వారం మొత్తం కార్యక్రమాలు నిర్వహిస్తుందనీ అలాగే గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో సభలను నిర్వహించడం జరుగుతుందని పలు సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు వెళ్లి వారికి తెలియజేశారు ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో ఫలితాలు ఎలా వచ్చినా పర్లేదు బాగా చదివించండి కానీ పరీక్షల్లో కాపీ మాత్రం కొట్టకూడదు. ఉన్నతమైన విలువలు అనేది విద్యార్థులకు ఉపాధ్యాయులు నేర్పించాలని తెలిపారు. విద్యార్థులు భవిష్యత్ లో ఉన్నతంగా ఎదగాలంటే బేసిక్ ఫౌండేషన్ స్కూల్ స్టడీ మాత్రమే అని తెలిపారు. పిల్లలకు చదువుతో పాటు ధైర్యంగా ఉండడం, రకరకాల కొత్త నైపుణ్యాలను నేర్పడం, కష్టం వస్తె ఎలా తట్టుకుని నిలబడే మానసిక స్థైర్యాన్ని, శారీరకంగా బలంగా దృఢంగా ఉండాలో ప్రతిది పాఠశాల నేర్పిస్తుంది. అన్నారు పదవ తరగతిలో 97% ఫలితాలు వచ్చాయంటే దాని వెనుక విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని వారిని అభినందించారు. చదువు పదవ తరగతి వరకు సాగినట్లు ఇంటర్ లో ఉండదు, ఇంటర్ లో మీ ఇష్టం ఉన్న సబ్జెక్ట్ ఆధారంగా నచ్చిన రంగంలో ఉన్నతంగా ఎదగాలని తెలిపారు. మీరు ఏదైతే నమ్ముతారో, ఎవరినైతే గౌరవిస్తారో, ఎవరినైతే ఆరాధిస్తారో, వాటిని బట్టే మీకు సమాజంలో గౌరవం లభిస్తుందని తెలిపారు. చదువుతో పాటు ఆటలు, యోగ, కల్చరల్ ఆక్టివిటీస్ లాంటివి నేర్పించాలని వాటి ద్వారా వ్యక్తిగతంగా దృఢంగా ఉండడంతో పాటు నాయకత్వ లక్షణాలతో కూడిన సామర్థ్యాలు విద్యార్థులకు వస్తాయని తెలిపారు. అనంతరం పదో తరగతిలో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పదివేల రూపాయల చెక్కు ను క్రీడలు లో ప్రతిభ కనబరిచిన పలువురికి విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వచ్చేవారం 18వ తేదీ నుండి 23వ తేదీ వరకు నిర్వహించబోయే యువత-క్రీడల ప్రోత్సాహం సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎంఈఓ లు, విద్యాశాఖ అధికారులు, పలు పాఠశాల ప్రిన్సిపల్ మరియు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మురుగునీటి కాలువ దుర్వాసన
# సమస్యకు శాశ్వత పరిష్కారం

**త్వరలో 10 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి**



**అమీన్పూర్, మే 17,(నినాదం):** బీరంగూడ డివిజన్ పరిధిలోని జయలక్ష్మి నగర్, లక్ష్మి సాయి మెడోస్ కాలనీల మీదుగా వెళ్తున్న ప్రధాన మురుగు నీటి కాలువలో గల బండతో మురుగునీరు ఒకే చోట నిల్వ ఉండడం మూలంగా వెలువడుతున్న దుర్వాసన సమస్యను వారం రోజుల్లో పరిష్కరిస్తామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఆదివారం ఉదయం అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ తో కలిసి కాలువను పరిశీలించారు. అనంతరం కాలనీవాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే జిఎంఆర్ స్వయంగా తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వారం రోజుల్లో బండను పూర్తిగా తొలగించి కాలువను శుభ్రపరచాలని జిహెచ్ఎంసి ఇరిగేషన్ ఎఇ గులాం ను ఆదేశించారు. కాలువ దుర్వాసన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపెడుతున్నామని తెలిపారు. బీరంగూడ డివిజన్ పరిధిలోని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళిక బద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. కాలనీలలో సీసీ రోడ్లు, యుజిడిల నిర్మాణం కోసం 10 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయని.. ఈ నెల 23వ తేదీన శంకుస్థాపన చేయబోతున్నట్లు తెలిపారు. తాము ఎదుర్కొంటున్న సమస్యను విన్నవించిన వెంటనే స్పందించి.. పరిష్కారం దిశగా కృషి చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఈఈ సురేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## భాజపా ఓబిసి మోర్చా ఉపాధ్యక్షురాలిగా సుజాత




**అల్వాల్,మే17 (నినాదం):** తెలంగాణ రాష్ట్ర భాజపా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షురాలుగా అల్వాల్ పట్టణానికి చెందిన పార్టీ సీనియర్ నాయకురాలు సామాజిక కార్యకర్త మోయి సుజాత నియమితు లయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఓబిసి మోర్చా అధ్యక్షుడు ఆనంద్ గౌడ్. ను ఎంపీ ఈటెల రాజేందర్. ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో పార్టీ పట్ల తమ విధేయతను గుర్తించి ఇట్టి అవకాశం కల్పించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్రరావు. ఎంపీ ఈటల రాజేందర్. ఓ బి సి మోర్చా అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా భాజపా పార్టీ బలోపేతం చేయడం టు ఎన్నికలలో పార్టీ విజయానికి తన వంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

NINADAM CINEMA

# సరికొత్త అవతారంలో నారా దేవాన్ష్..

## డైనోడీట్స్ పేరుతో పోడ్‌కాస్ట్ ప్రారంభం!

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మనవడు, మంత్రి నారా లోకేశ్ తనయుడు నారా దేవాన్ష్ సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. చిన్న వయసులోనే తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చుకునే దిశగా అడుగులు వేస్తూ, డైనోసార్ల నేపథ్యంగా 'డైనోడీట్స్' పేరుతో సొంతంగా ఒక పోడ్‌కాస్ట్ షోను ప్రారంభించారు. ఈ విషయానికి సంబంధించి మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఒక ఆసక్తికరమైన టీజర్ వీడియోను పంచుకున్నారు. ఈ శు క్రవారం మొదటి ఎపిసోడ్ విడుదల కానున్నట్లు ఆయన ప్రకటించారు.







# ఐదుగురు పిల్లల దత్తత..

## మంచు మనోజ్, మౌనిక దంపతుల కొత్త ప్రయాణం

ప్రముఖ సినీ నటుడు మంచు మనోజ్ తన జన్మదినాన్ని పురస్కరించుకుని సామాజిక సేవలో సరికొత్త అడుగు వేశారు. తన సతీమణి భూమా మౌనిక రెడ్డితో కలిసి 'ఐక్య ధైర్య సేన సమితి' పేరిట ఒక కొత్త సేవా సంస్థను (ట్రస్ట్) ప్రారంభించారు. ఆదివారం కేపీహెచ్‌బీ (ఖూనదీ)లో అభిమానులు ఘనంగా ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో మనోజ్ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ఈ నూతన ట్రస్ట్ పేరును అధికారికంగా ప్రకటించారు.

**ఐదుగురు పిల్లల దత్తత..**

సామాజిక బాధ్యతగా సమాజానికి తన వంతు సేవ చేయాలన్న సంకల్పంతో మనోజ్ ఈ నిర్ణయం తీసుకున్నారు. పుట్టినరోజు వేడుకల్లో భాగంగా మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ట్రస్ట్ ప్రారంభించిన తొలి రోజే, మొదటి అడుగుగా ఐదుగురు పిల్లలను దత్తత తీసుకుంటున్నట్లు మనోజ్ ప్రకటించారు. వారి విద్యాభ్యాస బాధ్యతలను పూర్తిగా తానే వహిస్తానని స్పష్టం చేశారు. తమ సేవా కార్యక్రమాలు కేవలం ఇక్కడికే పరిమితం కావని, ప్రతి పట్టణంలోనూ వీటిని విస్తరిస్తామని ఆయన తెలిపారు.

**ఇది రాజకీయాల కోసం కాదు: మంచు మనోజ్**

ఈ సేవా కార్యక్రమాల వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశాన్ని వివరిస్తూ మంచు మనోజ్ సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. 'నా పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడానికి ముందే, నేను, నా భార్య మౌనిక సేవా కార్యక్రమాలతో ప్రారంభించాలనుకున్నాము. జీవిత ప్రయాణంలో ఎన్ని ఎత్తుపల్లాలు ఎదురైనా, అంతిమంగా మానవత్వం, మనకు అండగా నిలిచే మనుషులే ముఖ్యమని తెలుసుకున్నాం. ఈ సేవాభావం మాలో ఈనాడు మొదలైంది కాదు, అది మా వ్యక్తిత్వంలోనే ఉంది. కష్టాల్లో ఉండి సహాయం అడిగేవారికి మా తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. ఈ రోజు ఆ సేవా స్ఫూర్తికి ఒక పేరు పెట్టి, మాతో కలిసి నడిచేలా మరిన్ని హృదయాలను ఆహ్వానిస్తున్నాము. మౌనిక ఆలోచనల నుంచి పుట్టిన ఈ 'ఐక్య' మా మనసుకు ఎంతో దగ్గరైనది. ఐక్య అంటే కలయిక.. మానవత్వం కోసం అందరం ఒక చోట చేరడం. భగవంతుడు మాకు ఇచ్చిన దానిని సేవ, విలువలు, సదుద్దేశం ద్వారా ఇతరులతో పంచుకోవాలనుకుంటున్నాము. రక్తదానం, అత్యవసర వైద్య సహాయం, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం ద్వారా ఎక్కడ సహాయం అవసరమైతే అక్కడ 'ఐక్య' ముందుంటుంది. ఇది రాజకీయమైనది కాదు. ఇది మా ఒక్కరిదీ కాదు. మానవత్వాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరిదీ. ఎందుకంటే తమకంటే గొప్ప ఉద్దేశం కోసం మనసులన్నీ ఏకమైనప్పుడు, జీవితాలు మారడమే కాదు.. కొత్త ఆశ మళ్లీ ఊపిరిపోసుకుంటుంది.' అని పేర్కొన్నారు.

# విడాకుల విషయంలో మౌనీరాయ్ బిగ్ ట్విస్ట్

బాలీవుడ్ నటి మౌనీ రాయ్, వ్యాపారవేత్త సూరజ్ నంబియార్‌ల వైవాహిక జీవితం గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఒకరినొకరు అన్ ఫాలో చేసుకోవడంతో విడాకుల రూమర్స్ వచ్చాయి. ఆ తర్వాత వీరిద్దరు తాము విడిపోతున్నట్లు ప్రకటించడంతో అంతా షాక్ అయ్యారు. తాజాగా ఒకరినొకరు సోషల్ మీడియాలో మళ్లీ ఫాలో చేసుకోవడం ప్రారంభించారు. విడాకుల ప్రకటన తర్వాత ఇన్ స్టా గ్రామ్‌లో అన్‌ఫాలో చేసుకున్న ఈ మాజీ జంట, ఇప్పుడు మళ్లీ ఫాలో బ్యాక్ చేసుకోవడంతో వీరి బంధంపై నెటిజన్లలో సరికొత్త చర్చ మొదలైంది. మౌనీ రాయ్ తన ఇన్ స్టా గ్రామ్ అకౌంట్ నుండి సూరజ్‌తో ఉన్న పాత పెళ్లి ఫొటోలను డిలీట్ చేసిందంటూ సోషల్ మీడియాలో కొన్ని రూమర్స్ వచ్చాయి. కానీ, అందులో ఎలాంటి నిజం లేదని తేలింది. మౌనీ రాయ్ తన అకౌంట్‌లో పెళ్లి ఫొటోలతో పాటు సూరజ్‌తో కలిసి ఉన్న పాత జ్ఞాపకాలను అలాగే ఉంచింది. మరోవైపు సూరజ్ ప్రొఫైల్‌లో మాత్రం మౌనీకి సంబంధించిన ఒకే ఒక్క ఫొటో ఉంది, అందులోనూ ఆమె ముఖం సరిగ్గా కనిపించడం లేదు. విడాకుల ప్రకటన తర్వాత సూరజ్ అకౌంట్ కొద్దిసేపు కనిపించకుండా పోయి, ఆ తర్వాత మళ్లీ యాక్టివ్ అయ్యింది. ప్రస్తుతం వీరి పాత ఫొటోలు నెట్టింట వైరల్ అవుతుండటంతో, అభిమానులు మౌనీ రాయ్‌కు మద్దతుగా కామెంట్లు పెడుతున్నారు. అంతేకాకుండా వీరిద్దరు విడాకుల విషయంలో వెనక్కి తగ్గినట్లు టాక్. మళ్లీ ఫాలో కావడంతో ఈ జంట కలవబోతున్నారని పలు వార్తలు వైరల్ అవుతున్నాయి. మొత్తానికి విడాకుల విషయంలో మౌనీ రాయ్ బిగ్ ట్విస్ట్ ఇచ్చిందనే చెప్పాలి.

# వారిని చూసి బాధ కలిగింది



'మహానటి' సినిమాతో యావత్ భారతదేశాన్ని తన నటనతో మంత్రముగ్ధులను చేసి జాతీయ అవార్డు గెలుచుకున్న నటి కీర్తి సురేష్ ఆ తర్వాత ఎన్నో చిత్రాల్లో నటించింది. కెరీర్ తొలినాళ్లలో కాస్త బొద్దుగా ఉన్న కీర్తి.. ఇటీవల కొంత జీరో సైజ్ లుక్‌లో మారిపోయింది. ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. అయితే గత కొంతకాలంగా ఆమె లుక్‌పై సోషల్ మీడియాలో విపరీతమైన చర్చ నడుస్తోంది. బొద్దుగా ఉన్న కీర్తి ఒక్కసారిగా జీరో సైజ్ లుక్‌లోకి మారడంతో.. ఆమె అందం కోసం లైపోసక్షన్, బేరియాట్రిక్ వంటి సర్జరీలు చేయించుకుందంటూ నెట్టింట పుకార్లు షికార్లు చేశాయి. ఈ రూమర్లపై ఇన్నాళ్లు సైలెంట్‌గా ఉన్న కీర్తి, తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఓ ఎమోషనల్ పోస్ట్ పెట్టి ట్రోలర్ల నోళ్లు మూయించింది. తన బాడీ ట్రాన్స్‌ఫార్మేషన్ వెనుక ఉన్న అసలైన కష్టాన్ని, కన్నీళ్లను ప్రపంచానికి పరిచయం చేసింది. తాను బరువు తగ్గడం వెనుక ఉన్న కష్టాన్ని వివరిస్తూ, 2018లో 'మహానటి' సినిమా తర్వాత హై-ప్రోటీన్, లో-కార్బ్ ఫుడ్‌తో పాటు విపరీతమైన వర్కవుట్స్ హెచ్ఐఐటీ, కార్డియో వ్యాయామాలు చేసి 9 నెలల్లో 10 కిలోలు తగ్గానని కీర్తి చెప్పింది. ఆ సమయంలో తను చాలా గర్వంగా ఫీల్ అయ్యానని, కానీ జనాలు మాత్రం తను సర్జరీలు చేయించుకుందని అనడం చూసి బాధ కలిగిందని పేర్కొంది. "నేను ఎప్పుడూ నా ముఖంతో సహా అన్నింటినీ సహజంగానే ఉంచుకున్నాను. నా కష్టమంతా ఒక కత్తి కింద నలిగిపోయిందన్న మాట వినగానే కొంచెం బాధేసింది" అంటూ సర్జరీ పుకార్లను పూర్తిగా కొట్టిపారేసింది. ఆ తర్వాత 2020లో తాను యోగా వైపు మళ్లానని, అది తనకు మానసిక ప్రశాంతతను, ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చిందని కీర్తి తెలిపింది. ప్రస్తుతం తన ఫిట్‌నెస్ దినచర్యలో స్ట్రెంగ్త్ ట్రైనింగ్, యోగా, యానిమల్ ఫ్లో, కాలిస్థెనిక్స్ వంటివి భాగమయ్యాయని చెప్పింది. "మనం బొద్దుగా ఉంటే సన్నగా అవ్వాలంటారు, సన్నగా ఉంటే బొద్దుగా ఉండాల్సింది అంటారు.. ఈ ప్రపంచం ఎలా ఆలోచిస్తుందో అని ఒక్కోసారి ఆశ్చర్యమేస్తుంది" అంటూ ఫైర్ అయింది. గత కొన్ని నెలలుగా తాను శారీరకంగా, మానసికంగా కొంత ఎదురుదెబ్బను తిన్నానని, అందుకే అందుబాటులో లేను అని కీర్తి ఓపెన్ అయ్యింది. అయితే జీవితంలో ఎలాంటి కష్టాలు వచ్చినా, విరామం తీసుకోవాల్సి వచ్చినా తీసుకుంటాను కానీ.. ఎప్పటికీ వదులుకోను అంటూ రాసుకొచ్చింది. కీర్తి సురేష్ పెట్టిన ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఆమె క్రమశిక్షణను, నిజాయితీని ఫ్యాన్స్ అభినందిస్తున్నారు.

# డేవిడ్ రెడ్డి టీజర్ విడుదల తేదీ వచ్చేసింది



మంచు మనోజ్ ప్రస్తుతం దర్శకుడు హనుమ రెడ్డి యక్కంటి తెరకెక్కిస్తున్న డేవిడ్ రెడ్డి చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమాలో ఆయనకు జోడిగా మారియా రియాబోషప్క కనిపించనుంది. హనుమ రెడ్డి యక్కంటి ఈ చిత్రంతోనే దర్శకుడిగా తన సినీ ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నారు. కొంతకాలం క్రితమే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కాగా ప్రస్తుతం చిత్రీకరణ శరవేగంగా కొనసాగుతోంది. తాజాగా ఈ మూవీ బృందం టీజర్ విడుదలకు సంబంధించిన అధికారిక ప్రకటనను విడుదల చేసింది. మంచు మనోజ్ పుట్టినరోజు సందర్భంగా మే 20న ఈ సినిమా టీజర్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. తాజాగా విడుదల చేసిన పోస్టర్‌లో మంచు మనోజ్ రైల్వే ట్రాక్ మధ్యలో నిలబడి కనిపించారు. ఆయనను వెనుక వైపు నుంచి చూపించడం ఆసక్తిని పెంచుతోంది. ఇప్పటివరకు విడుదలైన ప్రచార చిత్రాలను బట్టి చూస్తే ఈ మూవీ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు అర్థమవుతోంది. టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటే సినిమాపై మరింత అంచనాలు పెరిగే అవకాశం ఉంది. వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్, ట్రూ రాడిక్స్ బ్యానర్లపై భరత్ మోతుకూరి, వెంకట్ రెడ్డి నల్లాగంగుల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.

Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard Estate Margadarshi Building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787